కోటగిరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో..
వీక్షించండి చానల్
NS99 CHANNEL
దగా స్థానంలో నిగా వేసే చానల్

దగా స్థానంలో నిఘా వేసే జాతీయ దిన పత్రిక

నీలగిరి శంఖారావం

సమగ్ర సమాచార దర్శిని

తెలుగు జాతీయ దినపత్రిక

నల్లగొండ | సంపుటి :05 | సంచిక :176 | ఎడిటర్ : కోటగిరి చంద్రశేఖర్ | మంగళవారం 03-11-2026 | పేజీలు : 4 | వెల : రూ. 3/-

కరువు మండలాలను ప్రకటించడంలో ప్రభుత్వం విఫలం



నర్సాపూర్ : కరువు మండలాలను ప్రకటించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ఎద్దేవ చేశారు. సోమవారం నర్సాపూర్ మండల పరిధిలోని నర్సాపూర్, కాగజ్ మద్దూర్, పెద్ద చింతకుంట, కాజీపేట గ్రామాలలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ -35% ఉన్న మనోహరాబాద్ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి అంతకంటే తక్కువ శాతం ఉన్న నర్సాపూర్, చిలిపి చెడ్, కౌడిపల్లి మండలాలను ఎందుకు కరువు మండలాలుగా ప్రకటించలేదని ప్రశ్నించారు. కాబట్టి అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.సంగారెడ్డి జిల్లాలో అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించారని మెదక్ జిల్లా ఏం పాపం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. కరువు మండలాలుగా ప్రకటిస్తే సబ్సిడీపై ఎరువులు విత్తనాలు వస్తాయని, పశుగ్రాసం వస్తుందని, నీటికి నిధులు వస్తాయని, ఉపాధి పనుల్లో అదనంగా పనులు దొరుకుతాయని గుర్తు చేశారు. కరువు మండలం ప్రకటించకపోతే వీటన్నిటిని కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగపరుచుకోవాలని సూచించారు. దళారులకు ధాన్యాన్ని విక్రయించి మోసపోవద్దని తెలిపారు. వర్షాలు సరిగ్గా కురువక రైతులు పంట నష్టపోయారని, ఎకరానికి 30000 నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.వేరే రాష్ట్రాల నుండి ఏజెంట్ సంస్థలు రైతుల నుండి క్వింటాల్ కు 3300 వరకు చెల్లించి ధాన్యాన్ని సేకరిస్తున్నారని, వేరే రాష్ట్రాలకు ధాన్యం తరలిపోతే భవిష్యత్తులో రాష్ట్ర ప్రజలకు బియ్యం దొరకడం కష్టతరమవుతుందన్నారు. కావున ప్రభుత్వమే రైతులకు క్వింటాల్ కు 3300 చెల్లించి ధాన్యం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ లక్ష్మీ రాజు యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ రాజు యాదవ్, తాసిల్దార్ శ్రీనివాస్, పెద్ద చింతకుంట సర్పంచ్ శివకుమార్, కాజీపేట సర్పంచ్ యాదగిరి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి విజయం తథ్యం



బూర్గంపహాడ్, నవంబర్ 02 : గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి విజయం విజయం తథ్యం అని బీఆర్ఎస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే లేగా కాంతారావు అన్నారు. అన్నివర్గాల ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో, సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పాలన ఘోరంగా విఫలమైందన్నారు. సోమవారం బూర్గంపహాడ్ మండల పరిధిలోని మోరంపల్లిబంజర్ శ్రీ వేంకటేశ్వర ఫంక్షన్‌హాల్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియలో భాగంగా పార్టీ ముఖ్య కార్యకర్తలతో నిర్వహించిన మండల స్థాయి సమావేశంలో ఎమ్మెల్సీ ఎన్నికల నియోజకవర్గ ఇన్‌చార్జి దిండిగాల రాజేందర్ కలిసి రేగా మాట్లాడారు. అమలుకు సాధ్యం కాని హామీలను ఇచ్చి, ప్రజలకు బూటకపు మాటలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడిచినా ప్రజలకు ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి అమలు చేయకుండా ఘోరంగా విఫలం చెందిందన్నారు.త్వరలో జరగనున్న ఖమ్మం– వరంగల్– నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల ఓటరు నమోదును బీఆర్ఎస్ శ్రేణులు ముమ్మరంగా చేపట్టి ప్రతి ఒక్క పట్టభద్రుడు ఓటు నమోదు చేసుకునేలా చూడాలన్నారు. బీఆర్ఎస్ పార్టీని నమ్ముకుని పని చేస్తున్న కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని తెలిపారు. మరో ఏడాది ఓపిక పడితే కార్యకర్తల కష్టాలు తీరుతాయని పేర్కొన్నారు. మండలవ్యాప్తంగా అర్హులైన పట్టభద్రులను గుర్తించి ఓటరునమోదు చేసుకునేలా సహాయ, సహకారాలు అందించాలని, బీఆర్ఎస్ శ్రేణులు సమన్వయంతో పనిచేసి ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించేలా కృషి చేయాలన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో తప్పక విజయం సాధిస్తారని రేగా ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మాజీ జడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత, సొసైటీ మండల అధ్యక్షుడు బిక్కసాని శ్రీనివాసరావు, సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, ప్రజా ప్రతినిధులు, మండల నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, మహిళా నాయకులు పాల్గొన్నారు.

ఢిల్లీలో గ్రీన్ క్రాకర్స్ కాల్చుకోవచ్చు: సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు ఇచ్చింది. ఢిల్లీలో గ్రీన్ క్రాకర్స్ కాల్చేందుకు అనుమతి ఇచ్చింది. నవంబర్ 7, 8వ తేదీల్లో ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతాల్లో బాణాసంచా పేలుళ్ల గురించి అత్యున్నత న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. సర్టిఫై అయిన గ్రీన్ ఫైర్‌క్రాకర్స్‌ను పేల్చవచ్చు అని చెప్పింది. అయితే ఆ పటాకులను ఉదయం 6 నుంచి 7 వరకు, ఆ తర్వాత రాత్రి 8 నుంచి 19 వరకు పేల్చాలని కోర్టు పేర్కొన్నది. హాస్పిటళ్లు, నర్సింగ్ హోమ్‌లు, ప్రైమరీ, జిల్లా హెల్త్ సెంటర్లు, ఓల్డేజ్ హోమ్‌లు, నాటిఫైడ్ సైలెన్స్ జోన్లకు 300 మీటర్ల పరిధిలో బాణా సంచా పేల్చరాదు అని కోర్టు తెలిపింది.

జాతీయ నేత ఇమేజ్ కోసమే రేవంత్ ఆరాటం



హైదరాబాద్,కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సోమవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీ దేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు కుట్రలు పన్నుతున్నారని కిషన్ రెడ్డి ఆరోపించారు. విదేశీ శక్తులతో చేతులు కలిపి కేంద్ర ప్రభుత్వాన్ని కూల్చివేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. దేశంలో అశాంతిని సృష్టించడమే ధ్యేయంగా కాంగ్రెస్ వ్యవహరిస్తోందని, రాహుల్ గాంధీకి కేవలం ప్రధాని కుర్చీపైనే దృష్టి తప్ప దేశ సంక్షేమం పట్టదని విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో దేశంలో స్థిరమైన, పటిష్టమైన పాలన సాగుతోందని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ పన్నుతున్న కుట్రలు, రాహుల్ గాంధీ వైఖరిని ప్రజల ముందు ఎండగడతామని తెలిపారు. ఇందులో భాగంగానే ఇకపై అన్ని రాష్ట్రాల్లో విస్తృతంగా పాదయాత్రలు చేపట్టి ప్రజలకు నిజాలను వివరిస్తామని వెల్లడించారు.మరోవైపు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కూడా కిషన్ రెడ్డి విమర్శలు గుప్పించారు. రేవంత్ రెడ్డి జాతీయ నేతగా ఎదగాలని తీవ్రంగా ఆరాటపడుతున్నారని ఎద్దేవా చేశారు.

లక్ష మంది విద్యార్థులకు ఉచితంగా ఏఐ,క్లౌడ్ శిక్షణ..



హైదరాబాద్, తెలంగాణలో లక్ష మంది విద్యార్థులకు ఉచితంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), క్లౌడ్ కంప్యూటింగ్‌లో శిక్షణ అందించనున్నట్లు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. ప్రభుత్వంపై, కళాశాలలపై, విద్యార్థులపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. 'తెలంగాణ ఏఐ అండ్ క్లౌడ్ స్కిల్లింగ్ ఇనిషియేటివ్'లో భాగంగా అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్) సహకారంతో ఈ శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి సోమవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో టాస్క్, ఏడబ్ల్యూఎస్ మధ్య ఒప్పందం కుదిరింది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 643 టాస్క్ అనుబంధ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా వివిధ సాంకేతిక అంశాల్లో శిక్షణ అందిస్తామని తెలిపారు.

ఏఐ, మెషిన్ లెర్నింగ్‌లో ప్రత్యేక శిక్షణ

విద్యార్థులకు ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్, డేటా ఇంజినీరింగ్, మెషిన్ లెర్నింగ్, జనరేటివ్ ఏఐ తదితర అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు మంత్రి వివరించారు. కేవలం థియరీకే పరిమితం కాకుండా ప్రత్యక్షంగా ప్రాక్టికల్స్ చేసేందుకు ఏడబ్ల్యూఎస్ క్లౌడ్ కన్సోల్ సదుపాయాన్ని కల్పించనున్నట్లు చెప్పారు. ఇంజినీరింగ్, సైన్స్ విద్యార్థులతో పాటు ఆర్ట్స్, కామర్స్ వంటి నాన్-స్టెమ్ కోర్సుల విద్యార్థులకూ ప్రత్యేక లెర్నింగ్ ట్రాక్‌లు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. తద్వారా విభిన్న విద్యా నేపథ్యాలున్న విద్యార్థులు సైతం ఏఐ, క్లౌడ్ టెక్నాలజీలపై నైపుణ్యాలు పెంచుకునే అవకాశం ఉంటుందన్నారు.

ఏడాది పాటు 900కు పైగా డిజిటల్ కోర్సులు ఉచితం

ఈ కార్యక్రమంలో చేరిన ప్రతి విద్యార్థికి ఏడబ్ల్యూఎస్ స్కిల్ బిల్డర్ ద్వారా 900కు పైగా డిజిటల్ కోర్సులను ఏడాది పాటు ఉచితంగా వినియోగించుకునే అవకాశం కల్పించనున్నట్లు శ్రీధర్ బాబు తెలిపారు. అంతర్జాతీయ స్థాయి సర్టిఫికేషన్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు డిస్కౌంట్ వోచర్లు కూడా అందించనున్నట్లు చెప్పారు. అంతేకాకుండా సాంకేతిక నిపుణులతో ఇండస్ట్రీ కనెక్ట్ సెషన్లు, హ్యాకథాన్‌లు నిర్వహించి విద్యార్థులకు పరిశ్రమలతో అనుసంధానం కల్పించనున్నట్లు వివరించారు. ఈ శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న అర్హులైన విద్యార్థులకు టాస్క్ ఆధ్వర్యంలో ప్రత్యేక జాబ్ మేళాలు నిర్వహించనున్నట్లు మంత్రి వెల్లడించారు. విద్యార్థులకు శిక్షణ అందించడంతో పాటు ఆయా కళాశాలల్లోని అధ్యాపకులకు కూడా ఏఐ, క్లౌడ్ టెక్నాలజీల్లో ప్రపంచస్థాయి శిక్షణ కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీ శాఖ సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టా రెడ్డి, టాస్క్ సీఈవో నితిన్ రెడ్డి, ఏడబ్ల్యూఎస్ ఇండియా అండ్ సౌత్ ఆసియా పైసిడెంట్ సందీప్ దత్తా, ఎడ్యుకేషన్ అండ్ స్కిల్స్ హెడ్ అభినవ్, కంట్రీ మేనేజర్ (స్కిల్లింగ్ అండ్ సోషల్ ఇంపాక్ట్) ప్రతిభా, ఏడబ్ల్యూఎస్ అకాడమీ టీపీఎం ఆకాంక్ష రాయ్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

గడ్డం,మీసం పెంచితే రేవంత్ రెడ్డి అయిపోతావా?



హైదరాబాద్, కాళేశ్వరం నిర్మాణం వెనుక అసలు రహస్యం కేవలం కాసుల కక్కుర్తేనని, ఈ ప్రాజెక్ట్ వల్ల ఆదిలాబాద్ రైతులకు తీరని అన్యాయం జరిగిందని ప్రభుత్వ విప్ వేముల వీరేశం మండిపడ్డారు. సీఎల్పీ మీడియా సెంటర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదిలాబాద్‌లో కేటీఆర్ నిర్వహించిన పర్యటన పూర్తిగా అబద్ధాలు, గోబెల్స్ ప్రచారంతో నిండిపోయిందని, పదేళ్ల పాటు అధికారంలో ఉండి తెలంగాణ రైతాంగాన్ని నిండా ముంచిన ఘనత బీఆర్ఎస్‌దేనని ఆయన ధ్వజమెత్తారు.

నాటకాలు కట్టిపెట్టి సవాల్ స్వీకరించాలి

కేటీఆర్ ఒక డ్రామా ఆర్టిస్ట్‌లా వ్యవహరిస్తున్నారని వేముల వీరేశం విమర్శించారు. గడ్డం, మీసం పెంచినంత మాత్రాన కేటీఆర్.. రేవంత్ రెడ్డి కాలేరని, కేవలం వేషం, భాష మార్చినంత మాత్రాన తెలంగాణ ప్రజలు ఆయన తప్పులను క్షమించరని స్పష్టం చేశారు. 'మీ నాన్న కేసీఆర్‌ను అసెంబ్లీకి తీసుకోరండి.. రాష్ట్రంలో నెలకొన్న కరువు, ఎల్‌నినో పరిస్థితులపై నేరుగా చర్చించడానికి మేం సిద్ధంగా ఉన్నాం. బాధ్యతాయుతమైన ప్రతిపక్ష నాయకుడిగా కేసీఆర్ ఎందుకు బయటకు రావడం లేదు?' అని వేముల వీరేశం సవాల్ విసిరారు.

రైతు ప్రేమంటే ఆ 1500 కోట్లు ఇవ్వండి

బీఆర్ఎస్ పార్టీ ఖాతాలో ప్రస్తుతం 1500 కోట్ల రూపాయల నిధులు ఉన్నాయని, రైతులపై అంత ప్రేమ ఉంటే ఆ డబ్బును వెంటనే రైతాంగ సంక్షేమం కోసం ఖర్చు చేయాలని వేముల వీరేశం డిమాండ్ చేశారు. పదేళ్ల కాలంలో నియంతృత్వం, అక్రమ అరెస్టులతో రాష్ట్రాన్ని ఏలిన వారు, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై విషం చిమ్మడం విడ్డూరంగా ఉందన్నారు. తెలంగాణను ఏటీఎంగా మార్చుకుని కేసీఆర్ కుటుంబం కోట్లు కూడబెట్టుకుందని, పారదర్శకమైన ప్రజాపాలన అందిస్తున్న సీఎం రేవంత్ రెడ్డిపై అనవసర విమర్శలు చేస్తే ప్రజలే తగిన రీతిలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

సరిహద్దు వివాదాలకు చెక్ పెడతాం: మంత్రి పొంగులేటి



హైదరాబాద్,రాష్ట్రంలో రెవెన్యూ, ఫారెస్ట్ భూముల సరిహద్దు వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. సోమవారం సచివాలయంలో రెవెన్యూ, ఫారెస్ట్ విభాగాలు, సర్వే అండ్ సెటిల్‌మెంట్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రెండు విభాగాల నరిహద్దు వివాదాల వల్ల సామాన్య ప్రజలు, రైతులు ఏమాత్రం నష్టపోకూడదన్నారు. రెండు విభాగాలు పూర్తి సమన్వయంతో జాయింట్ సర్వేలు నిర్వహించాలని స్పష్టం చేశారు. రెవెన్యూ, ఫారెస్ట్ విభాగాలు సంయుక్తంగా క్షేత్ర స్థాయిలో సర్వేలు చేపట్టాలని, ఈ సర్వేలను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రీయ పద్ధతుల సాయంతో నిర్వహించి భూములకు స్పష్టమైన సరిహద్దులను గుర్తించాలన్నారు. శాస్త్రీయంగా సరిహద్దులను నిర్ధారించడం ద్వారా భవిష్యత్తులో తిరిగి ఎలాంటి వివాదాలు తలెత్తకుండా శాశ్వతంగా తెరపడుతుందన్నారు. రాష్ట్రంలో భూ పరిపాలనను మరింత బలోపేతం చేయడంలో భాగంగా సర్వే, సెటిల్‌మెంట్, భూ రికార్డుల శాఖ ద్వారా ప్రభుత్వం సమగ్ర సంస్కరణలు అమలు చేస్తోందన్నారు.

భూ రికార్డుల్లో పారదర్శకత..

భూ రికార్డులలో పూర్తి పారదర్శకత, ఖచ్చితత్వం తీసుకురావడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉద్ఘాటించారు. సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో పట్టుదలతో పనిచేసి దశాబ్దాల నాటి భూ వివాదాలకు త్వరితగతిన పరిష్కారం చూపాలని సూచించారు. ఈ సర్వేకు క్షేత్ర స్థాయిలో రైతులు, ప్రజలు సహకరించాలని సూచించారు. జిల్లా, మండల స్థాయిలో రెవెన్యూ, అటవీ అధికారులు సమన్వయంతో కమిటీలను ఏర్పాటు చేసి ముందుకు వెళ్లాలని ఆదేశించారు. సమావేశంలో రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, సర్వే అండ్ సెటిల్‌మెంట్ కమిషనర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పీసీసీఎఫ్ వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

గవర్నర్ కోటా ఎమ్మెల్సీలపై కాంగ్రెస్ కసరత్తు.. రేసులో ఉన్నది వీరే!

హైదరాబాద్, నవంబర్ 2,తెలంగాణలో నవంబర్ 14తో మూడు గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ కానున్నాయి. దీంతో అధికార కాంగ్రెస్ పార్టీలో ఆశావహుల సందడి మొదలైంది. సామాజిక సమీకరణాలను దృష్టిలో పెట్టుకొని మూడు స్థానాలను భర్తీ చేయాలని పార్టీ నాయకత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఎస్సీ మాదిగ, బీసీ, ఓసీ వర్గాలకు ప్రాధాన్యత ఇచ్చే అంశంపై చర్చ జరుగుతోంది. ఇవ్వటికే పలువురు నేతలు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. తెలంగాణ కాంగ్రెస్‌లో ఎమ్మెల్సీ పదవుల సందడి మొదలైంది. నవంబర్ 14తో ఖాళీ కానున్న మూడు గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాల కోసం పార్టీలో తీవ్ర పోటీ నెలకొంది. పదేళ్ల పాటు పార్టీ కోసం పనిచేసిన నేతలు ఇప్పుడు ఈ పదవులపై ఆశలు పెట్టుకున్నారు. దీంతో ఎవరికి అవకాశం దక్కుతుందనే అంశం కాంగ్రెస్ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. మూడు స్థానాల్లో ఒకటి ఎస్సీ మాదిగ సామాజికవర్గానికి కేటాయించే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. ఈ రేసులో దొమ్మాటి సాంబయ్య, నాగరిగారి ప్రీతమ్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. మరోవైపు మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్,



సంపాదకీయం

మంగళవారం 03-11-2026

ఇంట్లో మంట పెట్టనున్న ఎల్ నినో !

ఎల్ నినో. ఇపుడు ఈ పదమే భయపెడుతోంది. ఇప్పటిదాకా చూసిన ఎల్ నినో అన్నది ఒక ట్రైలర్ అయితే రానున్న ఆరేడు నెలలలో వచ్చేది సూపర్ ఎల్ నినో అంటున్నారు. అది అత్యంత భయంకరంగా ఉండబోతోంది అని చెబుతున్నారు. ఏకంగా ప్రతీ ఇంట్లో మంట పెట్టనుంది అని అంచనా వేసి మరీ చెబుతున్నారు. పొయ్యి కింద పొయ్యి మీద రెండింటికీ కలిపి ఒకేసారి కరవు తీసుకుని వచ్చే పవర్ ఫుల్ సూపర్ ఎల్ నినోని దేశం చూస్తోంది. ప్రత్యేకించి దక్షిణాది రాష్ట్రాలలో దీని ప్రభావం అత్యధికం అని చెబుతున్నారు. మరి ఇంతలా ఎల్ నినో వచ్చి మీద పడితే ఏమి చేయాలి అంటే చేయాల్సిన విధంగా పొదుపు చర్యలు ఎవరి మటుకు వారు పాటిస్తే తక్కువ నష్టంతో కష్టం తో బయటపడతామని దీని గురించి అంచనా వేస్తున్న వారంతా చెబుతున్నారు ఎల్ నినోతో పాటే వెంట వచ్చేవి నీటి కొరత, అలాగే అధిక వేడిమి, నిత్యావసర ధరలు భారీగా పెరుగుదల. ఇక ఒకదానితో ఒకటి లింక్ అయి ఉన్న ప్రతీ వస్తువూ ఎల్ నినో తో తీవ్రమైన ప్రభావమే చూపిస్తుంది అంటున్నారు. ముందుగా నీటి కొరత అయితే పట్టి పీడిస్తుంది అని అంటున్నారు. భూగర్భ జలాలు దారుణంగా పడిపోవడంతో తాగేందుకు కూడా నీరు ఉండని దారుణమైన పరిస్థితులను అంతా చూడబోతున్నారు అని చెబుతున్నారు. మరి ఈ సమయంలో ఏమి చేయాలి అంటే ఉన్న నీటిని ఇప్పటి నుంచే జాగ్రత్తగా పొదుపు చేసుకోవాలి. రెండు చెంబులు వాడాల్సిన చోట ఒక చెంబు వాడాలి. అలాగే పారబోయడం, నీటిని వృధా చేయడం అసలు చేయరాదు అని అంటున్నారు. ఇక తాగేందుకే నీటి కొరత ఉంటే పంటలకు ఎలా అన్నది పెద్ద ప్రశ్న. అలా పంటలు కూడా పూర్తిగా పండని స్థితి ఉంటుంది. దాంతో అందరూ తినే బియ్యానికి కూడా ఎక్కువగా కొరత ఏర్పడుతుందని చెబుతున్నారు. ఇప్పటికే ఎల్ నినో ప్రభావం అని చూపిస్తూ బియ్యం ధరలను ఎక్కడికక్కడ పెంచేస్తున్నారు. రానున్న ఆరు నెలలలో వీటి ధరలు ఇంకా ఎక్కువగా పెరగవచ్చు అని అంటున్నారు. దాంతో అన్నం ముద్ద ప్రతీదీ ఇపుడు అత్యంత విలువ కాబోతోంది. అనవసరంగా అన్నం పారేయడం అయితే చేయవద్దు అన్నది పెద్దల మాట. ఉన్న ముద్దను జగ్రత్తగా వాడుకోవడం మరో మంచి మాట. నిత్యావసరాలు అన్నీ కేవలం బియ్యం మాత్రమే కాకుండా నిత్యావసరాలు అన్నీ కూడా అత్యధిక ధరలు పలుకుతాయి. అది సామాన్యుడు కొనలేని స్థితికి వెళ్ళిపోతాయని అంటున్నారు. పప్పుల నుంచి వంట నూనెల నుంచి ఉల్లిపాయలు, చింతపండు, వంట గ్యాస్ నుంచి అన్నీ కూడా ఆకాశాన్ని అంటేలా ధరలు పెరిగిపోతాయని అంటున్నారు. ఇక కూరగాయల ధరలు ఇప్పటికే మార్కెట్ లో అదిరిపోతున్నాయి. ఇవి ఇంకా పెరిగి కిలో వంద రూపాయలు పై దాటినా ఆశ్చర్యం లేదని అంటున్నారు. విద్యుత్ కొరత : విద్యుత్ అన్నది ఎలా తయారవుతుంది అంటే నీటి నుంచే ఎక్కువ అన్నది తెలిసిందే. పైగా ఇది చవక అయినది కూడా. మరి నీరే లేని చోట విద్యుత్ ఉత్పత్తి భారీగా తగ్గిపోతుంది. దాంతో తీవ్రమైన విద్యుత్ కొరత ఏర్పడుతుంది అని అంటున్నారు. అందుకే ఇప్పటి నుంచే కరెంట్ ని కూడా పొదుపు చేయడం అలవాటు చేసుకోవాలి. ఎక్కువగా ఫ్యాన్లు ఏసీలు లైట్లూ వేసి వృధా చేస్తే రేపటి రోజున విద్యుత్ ఉండని నేపథ్యం ఉంటుంది. వస్తుంది కదా కరెంట్ అని ఈ రోజు ఖర్చు చేయడం కాదు తగ్గిస్తే అదే రేపటికి మనకు వెలుగు ఇస్తుంది అన్నది గుర్తెరగాలి. ఇక సూపర్ ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు అనవసర ఖర్చులను అదుపు చేయాలని సూచిస్తున్నారు. వేయి రూపాయలు ఖర్చు చేయాల్సిన చోట అయిదు వందలకే పరిమితం కావాలి. విలాసం ఏదో అవసరం ఏదో గుర్తించి ఆ విధంగా మసలుకోవాలని అంటున్నారు. ఎందుకంటే పెరిగే ధరలతో డబ్బు విలువ అమాంతం పడిపోతుంది. వందకు వచ్చేది రెండు వందలకు ఎగబాక వచ్చు. అపుడు నిత్యావసరాలకే ఎక్కువ బడ్జెట్ అవుతుంది. కాబట్టి చేతిలో డబ్బు ఉంచుకోవాలి. అది ప్రాణప్రదంగా ఖర్చు చేయాలని సూచిస్తున్నారు. అయితే సూపర్ ఎల్ నినో అని భయపడి వణికిపోయి ఇప్పుడే మొత్తం సరుకులు అన్నీ కొనేసి ఇంట్లో వేసుకున్నా కూడా అది కూడా తప్పే అవుతుంది. ఎందుకంటే డిమాండ్ అండ్ సప్లై చైన్ తో సాగే ప్రపంచంలో ఈ విధంగా తొందర పడితే మరింతగా ధరలు పెరిగి ఆ ప్రభావం ఇతర వస్తువుల మీద కూడా పడుతుంది. అందువల్ల జాగ్రత్తగా వ్యవహరిస్తే చాలు, అందరూ సూపర్ ఎల్ నినోని తట్టుకుని బయటపడతారని అంటున్నారు. వచ్చే ఆరు నెలలు గడిస్తే మాత్రం మంచి రోజులు వచ్చినట్లే అని అంటున్నారు. తస్మాత్ జాగ్రత్త.

గెలిచినా దొంగ ఓట్లే అంటరు

న్యూఢిల్లీ,కేంద్ర హోం మంత్రి అమిత్ షా గత వారం ఢిల్లీలో మాట్లాడుతూ, మరో 30 సంవత్సరాల పాటు బిజెపియే గెలుస్తుందని ధీమాగా ప్రకటించారు. అధికారం కోసం ప్రతిపక్షాలు కలలు కనవద్దన్నారు. ఆయన మాటలను బహుశా సందేహించనక్కర లేదేమో. ఎందుకంటే, ఓటర్ల జాబితాల నుంచి కోట్లాది మందిని తొలగించి, లక్షలాది మందిని అక్రమంగా చేర్చుతున్నట్లు వెలుగులోకి వస్తున్నపుడు ఎట్లా సందేహించగలం? అయితే అమిత్ షా గాని, ప్రధాని మోడీగాని, సంఘ్ పరివార్ గాని ఒకటి తెలుసుకోవాలి. వారు గెలిచినా అది దొంగ ఓట్లతో గెలవడమేననే అభిప్రాయం ఇప్పటికే స్థిర పడిపోయింది.'సర్' అవకతవకలు పొరపాటున జరుగుతున్నవో, చెదురు మదురైనవో కావు. ఉద్దేశపూర్వకంగా చేస్తున్నవనటానికి ఆధారాలు ఇప్పటికే కుప్పతెప్పలుగా బయటకు వచ్చాయి. ఇంకా వస్తూనే ఉన్నాయి. ఆ విషయమై ప్రజలనుంచి ఎన్ని ప్రశ్నలు ఎదురవుతున్నా మోడీ ప్రభుత్వపు దబాయింపులు, అధికార పక్షంనుంచీ, ఎన్నికల సంఘం నుంచి బుకాయింపులు, ఎదురు దాడులు, పోలీసులతో అణచివేతలు మినహా సవ్యమైన సమాధానాలు లేకపోవటాన్ని దేశమంతా చూస్తున్నది. అటువంటపుడు, అమిత్ షా ధీమాను నమ్మకుండా ఎట్లుండగలము. బిజెపి గెలుపు దొంగ ఓట్లతోనని భావించకపోవటం ఎట్లా సాధ్యమవుతుంది.ప్రముఖ ఆర్టిఐ యాక్టివిస్టు అంజలి భరద్వాజ్, 'సర్' ప్రక్రియను జరిపించాలన్న నిర్ణయం ఎవరిదంటూ ఇటీవల కేంద్ర ఎన్నికల సంఘానికి ఒక ప్రశ్న పంపారు. అందుకు ఆ సంఘం ప్రిన్సిపాల్ సెక్రెటరీ జవాబిస్తూ, అది తమ నిర్ణయం కాదన్నారు. ఈ విషయాన్ని ఆమె జంతర్ మంతర్ వద్ద వెల్లడించటంతో అందరూ ఉలికి పడ్డారు. ఎన్నికల సంఘం చట్ట ప్రకారం స్వతంత్రమైన రాజ్యాంగ సంస్థ. వారికి ప్రభుత్వం ఎటువంటి ఆదేశాలు, నిర్దేశనలు, సూచనలు ఇచ్చేందుకు వీలు లేదు. విజ్ఞాపనలు మాత్రం చేయవచ్చు. ఆ పని ఏ పార్టీ అయినా, సంస్థ అయినా, వ్యక్తులైనా చేయవచ్చు. 'సర్' వంటి అత్యంత కీలకమైన ప్రక్రియ గురించిన నిర్ణయం మాత్రం ఎన్నికల సంఘం తీసుకోవలసిందే. మరి ఆ నిర్ణయం తమది కాదని సంఘం ప్రిన్సిపాల్ కార్యదర్శి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారంగే దాని అర్థం ఏమవుతుంది? మరెవరో నిర్ణయించారని, దానిని కమిషన్ అమలు పరిచిందని. అటువంటి నిర్ణయం తీసుకోగల శక్తి, స్థాయి ఎవరికి ఉంటుంది? ఆ నిర్ణయాన్ని అమలు చేయించగలది ఎవరు? పెద్దగా ఊహించనక్కర లేదు.గమనించవలసిందేమంటే, అంజలి భరద్వాజ్ ఈ విషయం వెల్లడించి వారం రోజులయింది. కాని ఇంతవరకు ఎన్నికల సంఘం ఆ మాటను ఖండించలేదు. దీనంతటిని బట్టి, 'సర్' నిర్ణయం మోడీ ప్రభుత్వానిదని భావించకతప్పదు. ఇంతకూ అటువంటి కీలకమైన నిర్ణయం ఎందుకు తీసుకున్నట్లు? ఇందుకు సమాధానాన్ని కూడా పెద్దగా ఊహించనక్కరలేదు. ఈ మలుపు, అందరూ ఇప్పటికే మాట్లాడుతున్నట్లు, బిజెపి లోక్‌సభ సీట్లు 2024 ఎన్నికలలో తగ్గి, స్వంత మెజారిటీని కోల్పోయి, ఇతర పార్టీలపై ఆధారపడక తప్పని దుస్థితి ఏర్పడటంతో మొదలైంది. మామూలుగా ఇతరులతో కలిసి ఎన్‌డిఏ కూటమిని ఏర్పాటు చేయటం వేరు. అది వాజపేయి కాలం నుంచి ఉన్నదే. కాని, రెండు సార్లు (2014, 2019) వచ్చిన స్వంత మెజారిటీ 2024లో పోవటం భూకంపం వంటిది. ఆ స్థితి రాజకీయంగానే ఆందోళనకరం కాగా, మోడీ వంటి అ ప్రజాస్వామికునికి, అహంభావికి అది అవమానకరం కూడా అయిందనాలి.పరిస్థితి అదే విధంగా కొనసాగితే ఏమైనా జరగవచ్చు. అందువల్ల మొదలైంది క్రీడ. 2024 లోక్‌సభ తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో వీలైనన్ని గెలవనట్లయితే 2029 లోక్‌సభ నాటికి ప్రమాదం ముంచుకు వచ్చినట్లే. ఆ విధంగా 'సర్' పన్నాగం రూపు తీసుకుంది. అంజలి భరద్వాజ్ ఆర్టిఐ ప్రశ్నకు వచ్చిన సమాధానాన్ని గమనించినపుడు, 'సర్' నిర్ణయంతో పాటు అందులో భాగంగా ఎటువంటి అక్రమాలు జరగాలనే దంతా మోడీ యంత్రాంగమే ప్రణాళిక రచించి, ఎన్నికల సంఘం ద్వారా అమలు చేయించిందనే అభిప్రాయం అనివార్యంగా కలుగుతుంది. ఈ విషయమై అనుమానాలు, విమర్శలు ఎన్ని ఉండినా, కొన్ని ఆధారాలు తరచు వెల్లడి అవుతున్నా, ముగ్గురు ఎన్నికల కమిషనర్లలో ఇద్దరి అభ్యంతరాలు అకస్మాత్తుగా వెలుగులోకి రావటంతో తుఫాను మొదలు



కావటం తెలిసిందే. ప్రభుత్వం తేలుకుట్టిన దొంగవలె అసలు ప్రశ్నపై మౌనం వహించి, ఒక నికార్సయిన నియంతవలె అణచివేత చర్యలు మొదలుపెట్టింది.ఆర్టిఐ ప్రశ్న జవాబుల వంటివే పలు ఉదంతాలు పాముల పుట్ట బద్దలైనట్లు ఇంకా బయటపడుతున్నాయి. తాజా కేసు ఉత్తర ప్రదేశ్‌లోని పిలిభిత్ అసెంబ్లీ నియోజక వర్గానికి సంబంధించినది. ఓటర్ల తుది జాబితా ప్రకటితమైన తర్వాత అందులోని పేర్లను, ఓటర్ల పేర్లను పోల్చిచూడగా పదివేలకు పైగా పేర్లు పొరపాటుగా కనిపించాయి. అనగా వారు ఓటు వేయలేకపోయారన్న మాట. అక్కడ బిజెపి అభ్యర్థి కేవలం రెండు వేల ఓట్లతో గెలిచాడు. ఈ అవకతవకలను ఓటర్ల పక్షాన లాయర్లు కనుగొని ఫిర్యాదు చేయటంతో, ఇద్దరు అధికారులు, ఒక ఆపరేటర్ కలిసి ఆ పని చేసినట్లు వెల్లడైంది. వారిపై చర్యలు సరే. కాని ఆ ఎన్నిక ఫలితం మాటేమిటి? 2024 లోక్‌సభ తర్వాత బిజెపి గెలిచిన యుపితోపాటు బీహార్, మహారాష్ట్ర, హర్యానా, ఢిల్లీ, పశ్చిమబెంగాల్ అన్నీ దొంగ ఓట్ల విజయాలేనన్న మాట. బెంగాల్‌లోనూ ఓట్లు కోల్పోయిన కొందరు ట్రిబ్యునల్స్‌కు అప్పీలు చేయగా, అందులో సుమారు 90 శాతం తీర్పులు వారికి అనుకూలంగా రావటం తెలిసిందే.ఇటీవలనైతే ఫారం 7, ఫారం 8 అక్రమాలు వరుసగా వెల్లడవుతున్నాయి. బతికున్న వారిని చనిపోయినట్లు చూపుతూ, ఇల్లు మారకున్నా మారినట్లు చెప్తూ, ఉన్న ఓటర్లపై అభ్యంతరాలున్నట్లు వారికి తెలియకుండా మరెవరో దరఖాస్తు చేయగా అధికారులు విచారణ జరపకుండా ఓట్లను రద్దు చేస్తూ పోవటాలు జరుగుతున్నాయి. ఈ పని చేస్తున్నదంతా బిజెపి నాయకులు. అందుకు గురవుతున్నది అధికంగా ముస్లిములు. ఇవన్నీ సముద్రంలో నీటిబొట్టు వంటివని, మొత్తం తొలగించిన ఓట్లు 13 కోట్లన్న లెక్క తేలటంతో అందరికీ అర్థమైపోయింది. ఇది ఇంకా తుది సంఖ్య కాకపోవటం గమనించదగ్గది. ఇందులో నిజంగానే చనిపోయినవారు, అడ్రసులు మారినవారు ఉన్నారని కొన్ని లెక్కలు చెప్తున్నారు. ఆ లెక్కలలో నిజాయితీ ఎంతనో తేలేది ఎట్లా? పైగా, కమిషన్ చెప్తున్న లెక్కలన్నీ కూడినా 13 కోట్లలో సగమైనా కావటం లేదు. మరి కొన్ని రాష్ట్రాల సోకాల్డ్ తుది జాబితాలు ఇంకా ప్రకటించవలసి ఉన్నది కూడా.మొత్తం మీద అమిత్ షా ధీమాకైతే ఆధారాలు చాలానే కనిపిస్తున్నాయి. 2029 ఎన్నికల నాటికి ఈ 'సర్' వ్యవహారం ఎట్లా తేలేదీ చెప్పలేముగాని, ప్రజలూ, ప్రతిపక్షాలు, యువతంర ఎన్నెన్ని ఆందోళనలు జరిపినా లెక్కచేయక, వారిని అణచివేస్తూ ముందుకు సాగుతున మోడీ ప్రభుత్వం, అమిత్ షా ధీమాగా ప్రకటించినట్లు తిరిగి అధికారానికి వస్తే ఆశ్చర్యపడనక్కర లేదేమో. ఒకసారి కాదు. మరొక 30 సంవత్సరాల పాటు. అయితే, 2024 తర్వాతి అసెంబ్లీ విజయాలన్నీ దొంగ ఓట్లతోనేనని ప్రజలకు ఈసరికి అర్థమైనందున, 2029 లోక్‌సభ గెలిచినా అది తిరిగి దొంగ ఓట్లతోనేననటంలో ఎవరికీ సందేశం ఉండబోదు. ఒక మహత్తర సంస్కృతి గురించి మాట్లాడే సంఘ్ పరివార్‌కు, ఒక 'విశ్వగురు' చిత్రాన్ని ఆకాశానికి ఎత్తి పట్టుకునే బిజెపి పార్టీకి, దేశాన్ని అపూర్వమైన రీతిలో అభ్యుదయాత్మకమైన రీతిలో అభివృద్ధి పరుస్తున్నట్లు చాటుకునే ప్రభుత్వానికి, చివరకు దొంగ ఓట్లతో, ప్రజలను అణచివేస్తూ గెలవవలసిన దుస్థితి ప్రాప్తించిందంటే, వారిని చూసి దేశమే సిగ్గుపడవలసి వస్తున్నది.

ధరల అస్త్రంతో జగన్ అటాక్.. పాత లెక్కలతో టీడీపీ కౌంటర్.. నెట్టింట రచ్చ రచ్చ!



అమరావతి, ఏపీలో స్థానిక ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. ప్రధాన పార్టీలైన అధికార టీడీపీ, ప్రతిపక్ష వైసీపీ మధ్య సోషల్ మీడియా వేదికగా నిత్యావసర ధరలపై 'ట్వీట్ల యుద్ధం' నడుస్తోంది. ప్రజలపై ఎవరి హయాంలో ఎక్కువ భారం పడింది? ఎవరు ధరలు పెంచారనే అంశంపై ఇరు పక్షాలు ముమ్మరంగా ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకుంటున్నాయి.

చంద్రబాబుపై జగన్ విమర్శనాస్త్రాలు!

ముందుగా వైసీపీ అధినేత వైఎస్ జగన్ సోషల్ మీడియా వేదికగా కూటమి ప్రభుత్వంపై విమర్శల దాడికి దిగారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే నిత్యావసర ధరలు తగ్గిస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు.. ఇప్పుడు ఆ మాట తప్పారని ఆరోపించారు. చంద్రబాబు పాలనలో ప్రస్తుత ధరలు చూస్తే సామాన్యులు షాక్‌కు గురవుతున్నారని జగన్ వ్యాఖ్యానించారు. ముఖ్యంగా రోజువారీ వినియోగంలో ఉండే గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతుండటంతో మధ్యతరగతి, పేద ప్రజల బతుకులు భారంగా మారాయని విమర్శించారు. వీటితో పాటు విద్యుత్ ఛార్జీలు, ఆర్టీసీ బస్సు ఛార్జీలు పెంపు వైపు అడుగులు వేస్తూ ప్రజలపై అదనపు భారం మోపుతున్నారంటూ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

జగన్ ఆరోపణలకు టీడీపీ గట్టి కౌంటర్

జగన్ చేసిన ఆరోపణలను అధికార టీడీపీ అంతే వేగంగా తిప్పికొట్టింది. గత వైసీపీ హయాంలో జరిగిన ధరల పెంపును గుర్తుచేస్తూ సోషల్ మీడియాలో ఎదురుదాడికి దిగింది. గత వైసీపీ ఐదేళ్ల పాలనలోనే నిత్యావసరాల ధరలు చుక్కలనంటాయని ఆ విషయాన్ని కప్పిపుచ్చేందుకు జగన్ ఇప్పుడు తప్పుడు ప్రచారం చేస్తున్నారని టీడీపీ నేతలు కౌంటర్ ఇచ్చారు. వైసీపీ హయాంలో పెట్రోల్‌పై ఏకంగా మూడుసార్లు పన్నులు పెంచి 2021 నాటికే లీటర్ ధరను రూ.116కు తీసుకెళ్లిన చరిత్ర వైసీపీదేనని గుర్తుచేశారు. 'ట్రూ అప్ ఛార్జీలు' పేరుతో కరెంట్ బిల్లులను ఇష్టారాజ్యంగా పెంచి ప్రజల జేబులు ఖాళీ చేశారని, ఆస్తి పన్నును దాదాపు 45 శాతం పెంచారన్నారు. ఆఖరికి 'చెత్త పన్ను' పేరుతో ఇంటింటికీ బాదుడు కార్యక్రమం చేపట్టింది జగన్ కాదా అని ప్రశ్నించారు. అలాగే ఆర్టీసీలో డీజిల్ సెస్ పేరుతో ప్రయాణికులపై భారం మోపిన విషయాన్ని ప్రస్తావిస్తూ కౌంటర్ ట్వీట్లు చేశారు.

ధరల రాజకీయం.. పార్టీల వ్యూహం!

స్థానిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈ 'ధరల రాజకీయం' రెండు పార్టీలకూ అత్యంత కీలకంగా మారింది. సాధారణంగా స్థానిక పోరులో స్థానిక సమస్యలతో పాటు నిత్యావసర ధరలు, విద్యుత్ ఛార్జీలు, రవాణా ఖర్చులు వంటి అంశాలు ఓటర్ల తీర్పును ప్రభావితం చేస్తాయి. ప్రస్తుతం ఉన్న ధరల పెరుగుదలను చూపించి కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తిని పెంచాలని వైసీపీ ప్రయత్నిస్తోంది. దీనికి కౌంటర్ గా గత ప్రభుత్వంలో జరిగిన ఇష్టారాజ్యమైన పన్నుల విధింపు, కరెంట్ బాదుడు, చెత్త పన్నులను ప్రజలకు గుర్తుచేస్తూ వైసీపీకి విమర్శించే హక్కు లేదని తిప్పికొట్టే ప్రయత్నం చేస్తోంది టీడీపీ. మొత్తానికి సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న ఈ ట్వీట్ల యుద్ధం నెటిజన్లలో తీవ్ర చర్చనీయాంశమైంది. గత ఐదేళ్ల వైసీపీ పాలన.. ప్రస్తుత కూటమి రూలింగ్‌తో సరిపోల్చి చూసుకుంటున్న ప్రజలు.. స్థానిక ఎన్నికల్లో ఎవరి వైపు మొగ్గు చూపుతారో వేచి చూడాలి.

చేయూత ఫించన్ల కోసం దరఖాస్తులు

వరంగల్, తెలంగాణ ప్రభుత్వం చేయూత పింఛన్లకు సంబంధించి మరో కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం చేయూత పథకం కింద పింఛన్ పొందుతున్న భర్త మరణిస్తే వెంటనే భార్యకు పింఛన్ మంజూరు చేసే విధానం అమల్లో ఉంది. తాజాగా ఈ విధానాన్ని మరింతగా విస్తరించింది. ఇకపై దివ్యాంగులు, డయాలసిస్, హెచ్ఐవీ, ఫైలేరియా, గీత, చేనేత కార్మికుల పింఛనుదారులకూ కూడా ఈ విధానాన్ని వర్తింపజేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.చేనేత, గీత కార్మికులు.. దివ్యాంగులు, ఇతర కేటగిరీల్లో పింఛను అందుకునే జీవిత భాగస్వామి చనిపోతే మహిళలు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని గమనించిన ప్రభుత్వం.. వారికి అండగా నిలిచేందుకు తక్షణ పింఛను సాయం అందించాలని ప్రతిపాదనలు వచ్చాయి. ఈ ప్రతిపాదనలకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం రావడంతో ఉత్తర్వులు జారీ చేయాలని మంత్రి సీతక్క ఆదేశించారు.. దీంతో అధికారులు వెంటనే ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ చేయూత పథకం కింద పింఛన్లకు సంబంధించి కొన్ని మార్గదర్శకాలు కూడా ఉన్నాయి.దివ్యాంగ, గీత, చేనేత కార్మికులు సహా ఆయా కేటగిరీల కింద పింఛన్ పొందుతూ మరణించిన లబ్ధిదారుడి భార్య వయస్సు 57 ఏళ్ల కంటే తక్కువగా ఉంటే వితంతు పింఛను

రాజకీయాల్లో బంధువులు... వేర్వేరు పార్టీల్లో కుటుంబసభ్యులు

విజయవాడ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల సమరం రక్త సంబంధీకులు, బంధువుల మధ్య హోరాహోరీ పోరుగా రూపాంతరం చెందింది. రాజకీయ సమీకరణాలు, రిజర్వేషన్ల కేటాయింపుల పుణ్యమాని ఒకే కుటుంబానికి చెందిన వారు వేర్వేరు జెండాలు పట్టుకుని ఒకరిపై ఒకరు పోటీకి సిద్ధమవడంపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. ఎన్నికల వేళ పల్లెల్లో నెలకొన్న ఈ విచిత్రమైన వాతావరణం ఓటర్లతో పాటు స్థానికంగా హాట్ టాపిక్ అవుతోంది. మహిళా రిజర్వేషన్ అయిన చోట భార్యాభర్తలు కలిసి పోటీ చేస్తుంటే, మరికొన్ని చోట్ల ఒకే కుటుంబం నుంచి ఒకే స్థానానికి పోటీపడుతూ పదవి తమ గుమ్మం దాటకుండా చూపుకుంటున్నారని వ్యాఖ్యానిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి స్థానాలు పదుల సంఖ్యలో ఉన్నట్లు చెబుతున్నారు. శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస మండలంలోని కలివరం ఎంపీటీసీ స్థానానికి ఒకే కుటుంబానికి చెందిన తోడికోడళ్లు బుద్దేపు లక్ష్మి (తెలుగుదేశం పార్టీ), బుద్దేపు కూరమ్మ (వైఎస్సార్సీపీ) నామినేషన్లు దాఖలు చేశారు. ఒకప్పుడు ఇదే స్థానం కోసం అన్నదమ్ములు తలపడగా, ఇప్పుడు మహిళలకు రిజర్వు చేయడంతో తమ భార్యలను రణరంగంలోకి దించారని చెబుతున్నారు. ఇదే రీతిలో నెల్లూరు జిల్లా పొదలకూరు మండలంలోని మొగళ్లూరు ఎంపీటీసీ స్థానం ఎస్సీ మహిళకు రిజర్వ్ అయింది. ఈ స్థానం కోసం తోడికోడళ్లు అయిన కూకట్ల శంకరమ్మ (టీడీపీ), కూకట్ల ఉష (వైఎస్సార్సీపీ) సర్వశక్తులు ఒడ్డుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వార్డులు ఎంపీటీసీ స్థానాల విభజన తీరు కుటుంబాల మధ్య రాజకీయ విభేదాలకు ఆజ్యం పోసింది. ఉమ్మడి కుటుంబాల్లో కలిసిమెలిసి ఉండే సొంత అన్నదమ్ములు, బావబావమరుదులు సైతం వేర్వేరు పార్టీల కండువాలు కప్పుకుని బరిలో నిలుస్తున్నారు. ఉదయం లేచింది మొదలు రాత్రి వరకు ఎవరి పార్టీ వ్యూహాల్లో వారు బిజీగా ఉంటూ, బహిరంగ ప్రచారంలో ఒకరిపై ఒకరు విమర్శలు సంధించుకుంటున్న దృశ్యాలు అందరినీ ఆశ్చర్యపరుస్తున్నాయి. ఇక కాకినాడ జిల్లా రౌతులపూడిలో అయితే ఒకే కుటుంబం నుంచి భార్యాభర్తలు పైలా అశోక్, సౌజన్యలు వేర్వేరు ఎంపీటీసీ స్థానాల నుంచి టీడీపీ అభ్యర్థులుగా పోటీ చేస్తుండగా, అదే కుటుంబానికి చెందిన లోవ కళ్యాణి (సౌజన్య అడపడుచు వరుస) జెడ్పీటీసీ స్థానానికి బరిలో నిలిచి వినూత్న రాజకీయం నడిపిస్తున్నారు. మరోవైపు ఉమ్మడి గోదావరి జిల్లాలోని కడియం మండలంలో ఎంపీపీ పోరు రాజకీయంగా పీక్స్‌కి చేరింది. ఇక్కడ ఎంపీపీ పదవి జనరల్ మహిళకు కేటాయించడంతో ప్రముఖ నర్సరీ రైతులు తమ సకుటుంబంగా ఎన్నికల బరిలోకి దిగారు. కూటమి తరఫున బోడపాటి గోపాలకృష్ణ భార్య పుణ్యవతి, వైసీపీ తరఫున తాడాల విష్ణు చక్రవర్తి భార్య రాజరాజేశ్వరి ఈ పదవి కోసం పోటీపడుతున్నారు. కేవలం భార్యలే కాకుండా, ఆ భర్తలు కూడా వేర్వేరు ఎంపీటీసీ స్థానాల నుంచి పోటీ చేస్తుండటంతో ఈ కడియపులంక రాజకీయం రాష్ట్రవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. గ్రామాల్లో సొంత వాళ్ల పంచాయితీ నడుస్తుండటంతో ఓటర్లు డైలమాలో పడుతున్నారని చెబుతున్నారు. బంధుత్వానికి పెద్దపీట వేసి ఎవరికో ఒకరికి ఓటేయాలా? లేక తాము నమ్మిన పార్టీ సిద్ధాంతాలు, అభ్యర్థుల సమర్థతను బట్టి తీర్పునివ్వాలా? అని తేల్చుకోలేక తలలు పట్టుకుంటున్నారని అంటున్నారు. ఎన్నికల పోరు ముగిసి, ఫలితాలు వెలువడిన తర్వాత గెలుపు ఓటముల ప్రభావం ఈ కుటుంబాల బాంధవ్యాలపై ఎలాంటి ప్రభావం చూపుతుందనేది సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

ట్రంప్ ప్లాన్స్ ఏంటి ?

న్యూఢిల్లీ,అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై మరోసారి భారీ సైనిక చర్యకు దిగే అవకాశం ఉందని అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. నవంబర్ 3న జరగనున్న అమెరికా మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ ఘోర పరాజయం ఎదుర్కొంటే, ట్రంప్ మరింత దూకుడుగా వ్యవహరించే అవకాశం ఉందని ఓ అమెరికా అధికారి వెల్లడించినట్లు ఆక్సియోస్ కథనాన్ని ఉటంకిస్తూ న్యూస్18 పేర్కొంది. అయితే ఎన్నికల ఫలితాలు ఇరాన్‌పై నిర్ణయాలను ప్రభావితం చేయవని వైట్‌హౌస్ అధికారి ఈ వాదనను తోసిపుచ్చారు. రిపబ్లికన్లు ఎన్నికల్లో భారీగా నష్టపోతే ట్రంప్ తన రాజకీయ ప్రతిష్ఠకు భంగం కలిగిందని భావించి ఏదైనా పెద్ద నిర్ణయం తీసుకోవచ్చని ఓ అమెరికా అధికారి చెప్పినట్లు నివేదిక తెలిపింది. ఈ సందేశాన్ని ఇరాన్ అధికారులకు కూడా చేరవేస్తున్నారని పేర్కొంది. ఒప్పందం కుదుర్చుకోవడానికి ఇదే సరైన సమయమని వారికి చెబుతున్నట్లు వివరించింది. మరోవైపు, అమెరికా-ఇరాన్ మధ్య చర్చలను తిరిగి ప్రారంభించేందుకు ఖతార్ మధ్యవర్తులు ప్రయత్నిస్తున్నారు. శుక్రవారం టెహ్రాన్‌లో 12 గంటలకు పైగా చర్చలు జరిపినట్లు సమాచారం. ఈ చర్చల్లో కొంత సానుకూల పురోగతి కనిపించిందని ఓ దౌత్యవేత్త పేర్కొన్నారు. శనివారం దోహాలోనూ చర్చలు కొనసాగనున్నాయి. అణు కార్యక్రమంపై రాయితీలు ఇవ్వాలని అమెరికా కోరుతుండగా.. ముందుగా నౌకాదళ దిగ్బంధనాన్ని ఎత్తివేయాలని, నిలిపివేసిన నిధులను విడుదల చేయాలని, చమురు విక్రయాలకు అనుమతించాలని ఇరాన్ డిమాండ్ చేస్తోంది. ట్రంప్ ఆదేశిస్తే 96 గంటల్లోనే ఇరాన్‌పై కొత్త సైనిక చర్యలు ప్రారంభించేందుకు అమెరికా బలగాలు సిద్ధంగా ఉన్నాయని ఇటీవల సీఎన్ఎన్ కథనం వెల్లడించింది. ఇరాన్‌లోని ఇంధన వనరులు, సైనిక స్థావరాలు, అణు కేంద్రాలు లక్ష్యంగా దాడులు జరిగే అవకాశం ఉందని అమెరికా అధికారులను ఉటంకించింది. అయితే తుది నిర్ణయం ట్రంప్ తీసుకోవాల్సి ఉందని స్పష్టం చేసింది. అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో పశ్చిమాసియాలో మరోసారి యుద్ధ వాతావరణం నెలకొనే సూచనలు కనిపిస్తున్నాయి. అయితే దాడులకు సంబంధించి ట్రంప్ నుంచి ఇప్పటివరకు తుది ఆదేశాలు వెలువడలేదు.

అర్ధరాత్రి వేళ నిఘా మరింత పటిష్టం

జగిత్యాల, జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు రాత్రి వేళ నిఘాను మరింత బలోపేతం చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలు, చట్టవ్యతిరేక చర్యలు, దొంగతనా

ఇస్రో మరో ఘనత.. నింగిలోకి దూసుకెళ్లిన ఎన్‌వీఎస్-03 శాటిలైట్

దేశీయంగా అభివృద్ధి చేసిన అణు గడియారం ఈ ఉపగ్రహంలో మరో ప్రత్యేకతపెర, సైనిక అవసరాలకు స్వదేశీ నావిగేషన్ సేవలు బలోపేతంభారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో కీలక విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. దేశీయ నావిగేషన్ వ్యవస్థ 'నావ్‌ఐసీ' ను బలోపేతం చేసే లక్ష్యంతో చేపట్టిన ఎన్‌వీఎస్-03 ఉపగ్రహ ప్రయోగం విజయవంతమైంది. ఆంధ్రప్రదేశ్‌లోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి శుక్రవారం రాత్రి 11:51 గంటలకు జీఎస్ఎల్వీ-ఎఫ్18 రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. ప్రయోగం జరిగిన దాదాపు 20 నిమిషాల తర్వాత, 2,250 కిలోల బరువున్న ఎన్‌వీఎస్-03 ఉపగ్రహాన్ని రాకెట్ విజయవంతంగా నిర్దేశిత జియోసింక్రోనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్ (జీటీవో)లోకి ప్రవేశపెట్టింది. ఈ విషయాన్ని ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ ధ్రువీకరించారు. రాకెట్‌లోని అన్ని వ్యవస్థలు అద్భుతంగా పనిచేశాయని, ఉపగ్రహం ఆరోగ్యంగా ఉందని ఆయన తెలిపారు. ఈ ప్రయోగ విజయంతో, నావ్‌ఐసీ వ్యవస్థ సమర్థంగా పనిచేయడానికి అవసరమైన కనీస నాలుగు ఉపగ్రహాల మైలురాయిని ఇస్రో చేరుకుంది. ఇది దేశీయ స్థాననిర్ణయ, నావిగేషన్, టైమింగ్ (పీఎన్‌టీ) సేవలకు భరోసానిస్తుంది. ఈ ఉపగ్రహంలో దేశీయంగా అభివృద్ధి చేసిన అణు గడియారాన్ని అమర్చడం మరో విశేషం. ఇప్పటికే ఉన్న ఎల్5, ఎస్-బ్యాండ్ సిగ్నళ్లతో పాటు కొత్తగా ఎల్1 ఫ్రీక్వెన్సీ బ్యాండ్‌లోనూ ఇది సిగ్నళ్లను ప్రసారం చేస్తుంది. దీనివల్ల భారత భూభాగంతో పాటు, దేశ సరిహద్దుల నుంచి 1,500 కిలోమీటర్ల వరకు నావిగేషన్ సేవలు అందుబాటులోకి వస్తాయి. గతంలో మొదటి తరం ఉపగ్రహాల జీవితకాలం ముగియడం, అణు గడియారాల్లో సమస్యలు రావడం, ఎన్‌వీఎస్-02 ఉపగ్రహం ప్రొపల్షన్ సమస్యతో విఫలం కావడం వంటి అడ్డంకులను అధిగమించి ఇస్రో ఈ విజయాన్ని సాధించింది. కేవలం 56 రోజుల వ్యవధిలోనే మరో జీఎస్ఎల్వీ ప్రయోగాన్ని చేపట్టడం ఇస్రో సామర్థ్యానికి నిదర్శనం. ప్రస్తుతం ఉపగ్రహం తన ఆన్‌బోర్డ్ ఇంజిన్ల సాయంతో తదుపరి కక్ష్య పెంపు విన్యాసాలు చేపడుతుంది. అనంతరం తుది పరీక్షల తర్వాత ఇది నావ్‌ఐసీ వ్యవస్థలో సేవలు అందించడం ప్రారంభిస్తుంది. రహదారి, సముద్ర నావిగేషన్, విపత్తు నిర్వహణ, వ్యవసాయం వంటి పౌర అవసరాలతో పాటు, సైనిక వ్యూహాత్మక అవసరాలకు కూడా నావ్‌ఐసీ వ్యవస్థ అత్యంత కీలకం కానుంది.

ఫుట్‌పాత్‌పై బైక్ నడిపితే రూ.5 వేలు..

బెంగళూరు:బెంగళూరులో ట్రాఫిక్ నిబంధనలు మరింత కఠినతరం చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. సగం హెల్మెట్ ధరించే వాళ్లపై ఫైన్లు వేయడంతో పాటు వాటిని అమ్ముతున్న వారిపై, తయారీదారులపై కూడా కఠిన చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వం సిద్ధం అవుతున్నది. అలాగే ఫుట్‌పాత్‌లపై బైకులు నడిపితే రూ.500 ఉన్న ఫైన్‌ను రూ.5వేలకు పెంచనున్నారు. వన్‌వేపై వెళ్తే వేసే వెయ్యి జరిమానాను రూ.10వేలకు పెంచాలని ప్రభుత్వం యోచిస్తున్నది. ఈ మేరకు రాష్ట్ర రవాణా, హోం శాఖలు సమర్పించిన ప్రతిపాదనలపై ప్రభుత్వం పరిశీలన జరుపుతున్నది.బుధవారం విధానసౌధలో హోంమంత్రి ప్రియాంక్ ఖర్గే, రవాణా మంత్రి బి. సురేశ్ ఉన్నతాధికారులతో సంయుక్త సమీక్ష నిర్వహించారు. బెంగళూరులో ట్రాఫిక్ రద్దీ తగ్గించడం, రోడ్డు భద్రతను మెరుగుపరచడం, పదేపదే నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంపై చర్చించారు. ఫుట్‌పాత్‌లపై వాహనాల నడపడం, వన్‌వే ఉల్లంఘనలు, అక్రమ పార్కింగ్, నో పార్కింగ్ ప్రాంతాల్లో వాహనాల నిలుపుదల, సిగ్నల్ ఉల్లంఘనలపై జరిమానాలు పెంచే ప్రతిపాదనలూ సమావేశంలో చర్చకు వచ్చాయి. ప్రస్తుతం ఫుట్‌పాత్‌పై ద్విచక్ర వాహనం నడిపితే విధిస్తున్న రూ.500 జరిమానాను మొదటిసారి ఉల్లంఘనకు రూ.5,000కు, రెండోసారి ఉల్లంఘిస్తే రూ.10,000కు పెంచాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. వన్‌వే ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించేవారిపైనా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం యోచిస్తున్నది. ప్రస్తుతం ఈ ఉల్లంఘనకు రూ.1,000 జరిమానా ఉండగా.. దాన్ని పదిరెట్లు పెంచి రూ.10,000కు చేర్చాలని ప్రతిపాదించింది. రవాణా, హోం శాఖలు ఈ మేరకు ప్రతిపాదనలు సమర్పించాయి. న్యాయశాఖ అభిప్రాయం తీసుకున్న తర్వాత ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోనున్నది. పదేపదే ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడే వాహనదారులపై మరింత కఠినంగా వ్యవహరించేందుకు పాయింట్ల ఆధారిత డ్రైవింగ్ లైసెన్స్ విధానాన్ని తీసుకురావడంపైనా అధికారులు చర్చించారు. వివిధ రకాల ఉల్లంఘనలకు నిర్దిష్ట పాయింట్లు కేటాయిస్తారు. ఒక డ్రైవర్ నిర్దేశిత పరిమితికి చేరుకుంటే అతడి డ్రైవింగ్ లైసెన్స్‌ను సస్పెండ్ చేసే అవకాశం ఉంటుంది. ఈ విధానం అమలుకు అవసరమైన చట్టపరమైన అంశాలపైనా సమీక్షించారు. రవాణా శాఖకు చెందిన సారథి వ్యవస్థను బెంగళూరు ట్రాఫిక్ పోలీసుల ఈ-చలాన్ వ్యవస్థతో అనుసంధానించే అంశాన్ని కూడా పరిశీలించారు. దీనివల్ల వాహనదారుల డ్రైవింగ్ లైసెన్స్ చెల్లుబాటును పోలీసులు అక్కడికక్కడే తనిఖీ చేయగలుగుతారు. గతంలో చేసిన ట్రాఫిక్ ఉల్లంఘనల వివరాలనూ తెలుసుకోవచ్చు. కొత్తగా నమోదయ్యే ఉల్లంఘనలను నేరుగా డ్రైవర్ డిజిటల్ రికార్డుకు అనుసంధానించవచ్చు.

నిప్పులు చిమ్ముకుంటూ నింగిలోకి జీఎస్ఎల్వీ-ఎఫ్18

శ్రీహరికోట, భారత అంతరిక్ష సంస్థ ఇస్రో ఒక భారీ రాకెట్‌ను ప్రయోగించి విజయవంతమైంది. జీఎస్ఎల్వీ-ఎఫ్18 రాకెట్, 2026 అక్టోబర్ 30వ తేదీన రాత్రి 11:51 గంటలకు శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి నింగిలోకి దూసుకెళ్లింది. ఈ రాకెట్ ఎన్వీఎస్-03 అనే నావిగేషన్ ఉపగ్రహాన్ని మోసుకెళ్లింది. ప్రయోగం విజయవంతం కావడంతో ఇస్రో శాస్త్రవేత్తలు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.ఈ ఉపగ్రహం భారతదేశపు నావిక్ వ్యవస్థను మరింత బలోపేతం చేయనుంది. జీఎస్ఎల్వీ రాకెట్ తన 20వ ప్రయోగం. ఈ రాకెట్ ఎన్వీఎస్-03 ఉపగ్రహాన్ని జియోసింక్రోనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్‌లోకి ప్రవేశపెట్టింది. ఈ ప్రయోగం రెండవ లాంచ్ ప్యాడ్ నుండి ప్రవేశపెట్టిన ఇస్రో.. మూడు దశల్లో ప్రవేశపెట్టి సక్సెస్ చేసింది. దీంతో ఇస్రోలో శాస్త్రవేత్తలు సంబరాలు చేసుకున్నారు. జిఎూ-03 2232 బరువుగల శాటిలైట్‌ను నింగిలోకి మోసుకెళ్లింది. భారత్ సొంతంగా తయారు చేసుకున్న నావిగేషన్ వ్యవస్థను బలోపేతానికి జిఎూ-03ని ప్రయోగించింది. ఈ ఉపగ్రహం13 ఏళ్ల పాటు కక్షలో పని చేయనుంది.జిఎూ-03 అనేది రెండవ తరం నావిక్ ఉపగ్రహాలలో మూడవది. దీనికి స్వదేశీంగా తయారు చేసిన అటామిక్ క్లాక్, కొనుగోలు చేసిన అటామిక్ క్లాక్‌ను అమర్చారు. మునుపటి ఉపగ్రహాలలో ఒక్ , రా సిగ్నల్స్ ఉండేవి. ఇప్పుడు కొత్తగా ఒ1 సిగ్నల్‌ను జోడించారు. ఇది నావిగేషన్‌ను మరింత మెరుగుపరుస్తుంది. ఈ ఉపగ్రహం భారతదేశ భూభాగం, దాని చుట్టూ 1,500 కిలోమీటర్ల వరకు ఉన్న ప్రాంతానికి కచ్చితమైన ప్రదేశం, వేగం, సమయ సమాచారాన్ని అందిస్తుంది.నావిక్ అనేది భారతదేశపు సొంత నావిగేషన్ వ్యవస్థ. ఇది రెండు రకాల సేవలను అందిస్తుంది. ఒకటి సాధారణ ప్రజల కోసం ఉద్దేశించిన 'స్టాండర్డ్ పొజిషనింగ్ సర్వీస్', మరొకటి ప్రత్యేక ప్రయోజనాల కోసం ఉద్దేశించిన 'రెస్ట్రిక్టెడ్ సర్వీస్'.ఇస్రో మొత్తం ఐదు సెకండ్ జనరేషన్ ఉపగ్రహాలను నిర్మించాలని యోచిస్తోంది. ఇస్రో 2023 మే 29న జీఎస్ఎల్వి-ఎఫ్12 రాకెట్ ద్వారా ఎన్‌విఎస్-01ను అంతరిక్షంలోకి

'సర్' లోపాలపై సుప్రీం అసహనం

న్యూఢిల్లీ,ఎట్టకేలకు కోట్లాదిమంది ఓటర్లు, లక్షలాదిమంది యువత, ప్రతిపక్షపార్టీలు గత ఏడాదికిపైగా ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ లోని అవకతవకలపై చేస్తున్న న్యాయపోరాటం సుప్రీం కోర్టు పరిగణనలోకి రావడం చెప్పుకోదగిన అంశం. ఈ ప్రక్రియ అన్యాయమైనది, చట్టవిరుద్ధమైనది, రాజ్యాంగ విరుద్ధమైనది, ప్రజాస్వామ్య స్ఫూర్తికి వ్యతిరేకమైనదని ఓటర్లు, యువత, ప్రతిపక్ష పార్టీలు ఆరోపిస్తున్నాయి. సుప్రీం కోర్టు ఇదే విధంగా ముందుగానే స్పందించి ఉంటే ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు పోరాడుతున్న వారికి ఎదురైన ఎన్నో ఇబ్బందులు, అనవసరమైన బాధలు తప్పి ఉండేవి. అంతేకాకుండా ఈ కాలంలో జరిగిన ఎన్నికలు ప్రజల నిజమైన అభిప్రాయాన్ని, వారు తమ పాలకులుగా ఎవరిని ఎన్నుకోవాలనుకుంటున్నారో వారి నిర్ణయాలను మరింత కచ్చితంగా ప్రతిబింబించి ఉండేవి.ఢిల్లీలో చేపట్టిన 'సర్' ప్రక్రియకు సంబంధించి దాఖలైన పిటిషన్‌పై బుధవారం విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వం లోని ధర్మాసనం ఎన్నికల సంఘాన్ని కొన్ని కీలక ప్రశ్నలు అడిగింది. ఇప్పటికే ఓటరుగా నమోదైన వ్యక్తి ఏ కారణం చేతనో ఎన్యుమరేషన్ ఫారాన్ని తిరిగి ఎన్నికల సంఘానికి సమర్పించకపోతే అతని ఓటు హక్కును శాశ్వతంగా రద్దు చేస్తారా? ఓటరు జాబితా నుంచి తొలగించిన వ్యక్తులను మళ్లీ ఫారం 6 నింపి కొత్త ఓటర్లుగా దరఖాస్తు చేసుకోవాలని కోరడం తప్పు కాదా? ఎవరైనా ఓటరు తన నివాసం చిరునామా మార్చుకుంటే ఆ కొత్త చిరునామా వివరాలను మాత్రమే తెలియజేసే అవకాశం ఎందుకు ఇవ్వకూడదు? ఎన్యూమరేషన్ ఫారాలను సమయానికి సమర్పించలేదని ఓటర్ల జాబితానుంచి తొలగించబడిన వ్యక్తులు, ఆ తర్వాత అదే ఫారాలను సమర్పించే అవకాశం ఎందుకు కల్పించకూడదు? అని అభ్యంతరాలు లేవదీసింది.అలాగే చట్టం నిర్దేశించిన పరిధిని మించి ఫారం6 లో మార్పులు చేయడానికి ఎన్నికల సంఘానికి ఏ అధికారం ఉందని నిలదీసింది. ప్రస్తుతం జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా, ఢిల్లీ లోని మొత్తం 1.45 కోట్ల మంది ఓటర్లలో సుమారు 47లక్షల మంది పేర్లు ముసాయిదా ఓటర్ల జాబితానుంచి తొలగించబడ్డాయి. ఈ 47లక్షల మంది ఓటర్లను తిరిగి సంప్రదించేందుకు, వారి వివరాలను నిర్ధారించేందుకు ప్రత్యేక విధానాన్ని రూపొందించాలని సుప్రీం కోర్టు ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. ప్రస్తుత ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (సర్) విధానంలో లోపం ఏమిటంటే ఓటర్ల నమోదు బాధ్యతను ప్రభుత్వం నుంచి ఓటర్ల బాధ్యతగా మార్చడం. ఒక వ్యక్తి కేవలం నివాసం మాత్రమే మార్చుకున్నా ఓటర్ల జాబితానుంచి అతని పేరును తొలగించేస్తున్నారు.బీహార్‌లో ముసాయిదా ఓటర్ల జాబితానుంచి తొలగించిన పేర్లలో 55% మంది 'చిరునామా మార్చుకున్నారు', లేదా 'అందుబాటులో లేరు' అనే కారణాలతో తొలగించబడ్డారు. ఈ పరిస్థితి సర్ మూడో దశలోని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 72 శాతానికి పెరిగింది. ఇవే కారణాలతో కర్ణాటకలో సుమారు 84లక్షల మంది ఓటర్ల పేర్లను తొలగించారు. అయితే అభ్యంతరాలు, క్లెయిమ్‌ల దశలో కొత్త ఓటర్లతో కలిపి నికరంగా కేవలం 8.2లక్షల మందిని మాత్రమే జాబితాలో తిరిగి చేర్చారు.



నివాసం మార్చుకున్న ఓటర్లను కొత్త ఓటర్లుగా మళ్లీ దరఖాస్తు చేసుకోమని కోరడం వల్ల ఎన్నికల సంఘం చారిత్రాత్మక లక్ష్యమైన ఓటు హక్కును విస్తరించే విధానం దెబ్బతింటుంది. 2002 03లో ఓటర్ల జాబితా సవరణ సమయంలో ఓటర్లు నివాసం మార్చుకుంటే ఆ కొత్త నివాసానికి అధికారులు వెళ్లి అక్కడే ఓటర్లుగా నమోదు చేసేవారు.అదే సమయంలో వారి పాత ఓటరు నమోదు వివరాలను ముఖ్య ఎన్నికల అధికారి సమన్వయం చేసి సరిచూసేవారు. గతంలో ప్రభుత్వం, ఎన్నికల అధికారులు ఓటర్లను గుర్తించి వారి పేర్లను జాబితాలో చేర్చే బాధ్యత తీసుకునేవారు. కానీ ఇప్పుడు సర్ విధానంలో ఓటర్లే తమ పేర్లను తిరిగి నమోదు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఓటర్ల అర్హతను వారి కుటుంబ సభ్యుల సంఖ్య లేదా ఓటరుకు, వారి తల్లిదండ్రులకు మధ్య ఉన్న వయస్సు వ్యత్యాసం ఆధారంగా నిర్ణయించాలని ఏ చట్టం లేదా నిబంధన చెప్పడం లేదు.కానీ ఎన్నికల సంఘం ఇలాంటి అంశాల ఆధారంగా కొన్ని అసంబద్ధమైన, కంప్యూటర్ అల్గారిథమ్‌ల ఆధారిత 'తార్కిక వ్యత్యాసాల తనిఖీలను' చేపట్టింది. పశ్చిమబెంగాల్‌లో ఇలాంటి తనిఖీల కారణంగా 22లక్షల మంది ఓటు హక్కును కోల్పోవడం అత్యంత బాధాకరం. వీరంతా తమకు న్యాయం చేయాలని కోరుతూ కోర్టు ట్రిబ్యునళ్లను ఆశ్రయించారు.అలాగే ఢిల్లీలో ముస్లింలను ఇతరులతో పోలిస్తే ఎక్కువ సంఖ్యలో అనుమానాస్పద ఓటర్లుగా గుర్తించారు.ఓటర్ల అర్హతను నిర్ణయించడానికి ఎన్నికల సంఘం అనుసరిస్తున్న 'తార్కిక వ్యత్యాసాల తనిఖీలకు చట్టబద్ధమైన ఆధారం ఉందా లేదా అనే విషయాన్ని కోర్టు తేల్చాలి. కోర్టు కేవలం ఓటరు నమోదు గడువును పొడిగించడం, ప్రాంతాల వారీ ముద్రించిన ఓటర్ల జాబితాలను ప్రదర్శించడం వంటి తాత్కాలిక పరిపాలనా పరిష్కారాలను మాత్రమే సూచించకూడదు. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది. లక్షలాది మంది ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోయారని ఆరోపణలు ఎదురవుతున్న నేపథ్యంలో సుప్రీం కోర్టు జోక్యం చేసుకుని ఓటు హక్కును కాపాడాలని, దేశ ప్రజాస్వామ్య వ్యవస్థపై ఇంత తీవ్రమైన దెబ్బకొట్టిన ఎన్నికల సంఘాన్ని, ఆ సంఘాన్ని నిర్వహిస్తున్న బాధ్యులైన అధికారులను జవాబుదారీగా నిలబెట్టాలన్న అభిప్రాయం ఓటర్లలో కనిపిస్తోంది. అలాగే ప్రస్తుత ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను రద్దు చేసి, మొదటి నుంచి మళ్లీ ఈ ప్రక్రియను ప్రారంభించాలన్న వాదన వినిపిస్తోంది.

సైబర్ గ్యాంగ్స్‌కు చెక్...! రూ.104 కోట్లతో ఐఐటీ కాన్పూర్ భారీ ప్రాజెక్టు!



లక్నో,ప్రభుత్వ డిజిటల్ వ్యవస్థలపై సైబర్ దాడులు పెరుగుతున్న నేపథ్యంలో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని ప్రభుత్వ నెట్‌వర్క్‌లు, డిజిటల్ మౌలిక సదుపాయాలకు రక్షణ కవచంగా రూ.104.28 కోట్లతో ప్రత్యేక సైబర్ సెక్యూరిటీ ఆపరేషన్స్ సెంటర్ (ఖూ-జూూజ) ఏర్పాటు చేయనుంది. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు ఏర్పాటుతోపాటు నిర్వహణ బాధ్యతలను ఐఐటీ కాన్పూర్‌కు అప్పగించింది. ఆ సంస్థకు చెందిన సైబర్ సెక్యూరిటీ టెక్నాలజీ ఇన్నోవేషన్ హబ్ ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసి, తొలి మూడేళ్లపాటు కార్యకలాపాలు, నిర్వహణ బాధ్యతలను పర్యవేక్షించనుంది. రాష్ట్ర కేబినెట్ ఈ ప్రాజెక్టుకు ఆమోదం తెలిపింది.

ప్రభుత్వ నెట్‌వర్క్‌లపై నిరంతర నిఘా..

ప్రభుత్వ శాఖలకు సంబంధించిన డిజిటల్ వ్యవస్థలను ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చి నిరంతరం పర్యవేక్షించడమే ఈ కేంద్రం ప్రధాన లక్ష్యం. ప్రభుత్వ వెబ్‌సైట్లు, అప్లికేషన్లు, డేటా, నెట్‌వర్క్‌లతో పాటు కీలక సమాచార వ్యవస్థలపై 24 గంటలూ నిఘా కొనసాగించనుంది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ), ఆపరేషనల్ టెక్నాలజీ (ఓటీ) విభాగాల్లో అనుమానాస్పద కార్యకలాపాలను గుర్తించి, సైబర్ దాడులు జరిగే అవకాశాలను ముందుగానే అంచనా వేస్తుంది. ఏదైనా దాడి జరిగినప్పుడు దాని తీవ్రతను విశ్లేషించి, సంబంధిత శాఖలు తక్షణమే స్పందించేలా సహకరిస్తుంది.

ఏఐ, మెషిన్ లెర్నింగ్‌తో రక్షణ..

సైబర్ ముప్పులను గుర్తించేందుకు ఈ కేంద్రంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించనున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్), సెక్యూరిటీ ఇన్ఫర్మేషన్ అండ్ ఈవెంట్ మేనేజ్‌మెంట్ , సెక్యూరిటీ ఆర్కెస్ట్రేషన్ ఆటోమేషన్ అండ్ రెస్పాన్స్ , నెట్‌వర్క్ డిటెక్షన్ అండ్ రెస్పాన్స్ వంటి ఆధునిక సాంకేతిక వ్యవస్థలు ఇందులో కీలకంగా వ్యవహరించనున్నాయి. వీటి సాయంతో సైబర్ దాడుల ఆనవాళ్లను గుర్తించడం, ముప్పు తీవ్రతను అంచనా వేయడం, దాడులకు కారణాలను విశ్లేషించడం సాధ్యమవుతుంది. భవిష్యత్తులో ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా అవసరమైన రక్షణ చర్యలూ చేపట్టనున్నారు.

శిక్షణ.. సైబర్ డ్రిల్స్ కూడా..

ఈ ప్రాజెక్టు కేవలం సైబర్ దాడులను పర్యవేక్షించడానికే పరిమితం కానుంది. వివిధ ప్రభుత్వ శాఖల చీఫ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఆఫీసర్లు, నోడల్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనిచేయనుంది. సిబ్బందికి ప్రత్యేక సైబర్ భద్రతా శిక్షణ ఇవ్వడంతో పాటు.. వ్యవస్థల్లోని లోపాలను గుర్తించే వల్నరబిలిటీ అసెస్‌మెంట్లు, సైబర్ డ్రిల్స్, స్వతంత్ర భద్రతా ఆడిట్లు నిర్వహించనుంది. తద్వారా ప్రభుత్వ శాఖలన్నింటిలోనూ సైబర్ దాడులను ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంపొందించనున్నారు.

డిజిటల్ సదుపాయాలకు రక్షణ కవచం..

ఈ కేంద్రం ఏర్పాటుపై ఐఐటీ కాన్పూర్ డైరెక్టర్ ప్రొఫెసర్ మనీంద్ర అగర్వాల్ స్పందిస్తూ.. మారుతున్న సైబర్ ముప్పుల నుంచి రాష్ట్ర డిజిటల్ మౌలిక సదుపాయాలను కాపాడేందుకు ఇది కీలక ముందడుగని పేర్కొన్నారు. సైబర్ భద్రతలో చిన్నపాటి ఉల్లంఘన జరిగినా అత్యవసర ప్రభుత్వ సేవలకు అంతరాయం కలగడంతో పాటు కీలక సమాచారం దుర్వినియోగమయ్యే ప్రమాదం ఉందన్నారు. అలాంటి ముప్పులను ముందుగానే గుర్తించి అడ్డుకునేందుకు ఈ కేంద్రం దోహదపడుతుందని తెలిపారు.

ఇప్పటికే కీలక సంస్థలకు సేవలు..

సైబర్ భద్రతా రంగంలో ఐఐటీ కాన్పూర్‌కు చెందిన సీ3ఐహబ్‌కు ఇప్పటికే అనుభవం ఉంది. భిలాయ్ స్టీల్ ప్లాంట్ (సెయిల్), నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ), ఇండియన్ పోర్ట్స్ అసోసియేషన్ వంటి కీలక సంస్థలకు సెక్యూరిటీ ఆపరేషన్స్ సెంటర్ సేవలను అందించినట్లు ఐఐటీ కాన్పూర్ వెల్లడించింది. అత్యంత కీలకమైన మౌలిక సదుపాయాల రక్షణలో సంపాదించిన ఈ అనుభవాన్ని ఇప్పుడు రాష్ట్రస్థాయి ప్రాజెక్టుకు వినియోగించనుంది.

అన్ని శాఖలకు సమగ్ర సైబర్ రక్షణ..

ప్రభుత్వ సేవలు క్రమంగా ఆన్‌లైన్ వేదికలపై ఆధారపడుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో.. వాటిపై సైబర్ దాడులు జరిగితే ప్రజలకు అందే సేవలకు తీవ్ర అంతరాయం కలిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో యూపీ ప్రభుత్వం చేపట్టిన ఈ ప్రాజెక్టు అన్ని ప్రభుత్వ శాఖలకు సమగ్ర సైబర్ రక్షణ వ్యవస్థగా నిలవనుంది. సాంకేతిక పరిజ్ఞానంతో ముప్పులను ముందుగానే గుర్తించి, దాడులు జరిగినప్పుడు వేగంగా స్పందించేలా వ్యవస్థను సిద్ధం చేయనున్నారు.

కురవిలో స్కూల్ వ్యాన్ బోల్తా,12 మంది విద్యార్థులకు గాయాలు..

కురవి,పాఠశాలకు వెళ్లేందుకు ఎంతో ఉత్సాహంగా స్కూల్ వ్యాన్ ఎక్కిన చిన్నారులకు తృటిలో పెను ప్రమాదం తప్పింది. డ్రైవర్ నిర్లక్ష్యంతో విద్యార్థులతో వెళ్తున్న వ్యాన్ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో 12 మంది చిన్నారులు గాయపడ్డారు. అయితే వ్యాన్ చెరువు శిఖంలోని బూరుగు చెట్టుకు తగిలి ఆగిపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. లేదంటే వ్యాన్ నేరుగా చెరువులోకి దూసుకెళ్లి ఉండేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలోని గీతాంజలి ప్రైవేట్ పాఠశాలకు చెందిన టాటా ఏస్ వ్యాన్ శనివారం ఉదయం రేకుల తండాలో విద్యార్థులను ఎక్కించుకుంది. అనంతరం కురవి, తిరుమలాపురం గ్రామాల్లో మరికొందరు చిన్నారులను ఎక్కించుకుని నల్లెల్లకు బయలుదేరింది. ఈ క్రమంలో తిరుమలాపురం శివారులోని పెద్ద చెరువు కల్వర్టు వద్దకు రాగానే వ్యాన్ ఒక్కసారిగా అదుపుతప్పింది. రోడ్డు దిగి కల్వర్టు అంచు నుంచి కిందకు వెళ్లి చెరువు శిఖంలో బోల్తాపడింది. ఈ క్రమంలో అక్కడున్న బూరుగు చెట్టుకు వ్యాన్ తగిలి ఆగిపోయింది. వ్యాన్ చెట్టుకు తగిలి ఆగిపోవడంతో అందులోని చిన్నారులు ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. చెట్టు అడ్డుగా లేకుంటే వ్యాన్ నేరుగా చెరువులోకి దూసుకెళ్లేదని స్థానికులు పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో రేకుల తండాకు చెందిన రెండో తరగతి విద్యార్థిని దక్షిత, రామచంద్రాపురానికి చెందిన యూకేజీ విద్యార్థి వేదాంశ్, తిరుమలాపురానికి చెందిన వెల్లెను వేదాంశ్, కురవికి చెందిన కానుగంటి తన్మయి శ్రీతో పాటు మొత్తం 12 మంది విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాద సమాచారం అందుకున్న కురవి ఎస్సై సతీష్ పోలీసు సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్!: ప్రమాదం గురించి తెలియగానే పిల్లల తల్లిదండ్రులు

బెజవాడలో త్రిముఖ పోరు

విజయవాడ, ఆంధ్రప్రదేశ్ రాజకీయాలకు కేంద్రబిందువైన విజయవాడ కార్పొరేషన్ మేయర్ ఎన్నిక రోజురోజుకూ ఉత్కంఠభరితంగా మారుతోంది. అధికార ఎన్డీయే కూటమి ఉమ్మడి అభ్యర్థిగా వంగవీటి రాధాకృష్ణ బరిలో నిలవగా, ప్రధాన ప్రతిపక్షం వైఎస్సార్‌సీపీ తరపున మాజీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి మరోసారి పోటీ పడుతున్నారు. అయితే, ఈ ద్విముఖ పోరును అనూహ్యంగా త్రిముఖ సమరంగా మారుస్తూ మాజీ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు స్వతంత్ర అభ్యర్థిగా రంగానికి దిగడం బెజవాడ రాజకీయ వాతావరణాన్ని ఒక్కసారిగా వేడెక్కించింది. వామపక్షాలు , కాంగ్రెస్ పార్టీల ఐక్య మద్దతుతో ఆయన నిర్వహిస్తున్న ప్రచారం సాంప్రదాయ రాజకీయ పార్టీల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది.మాజీ సీపీగా బెజవాడ నగరంపై పరిపూర్ణమైన పట్టు, శాంతిభద్రతలపై స్పష్టమైన అవగాహన ఉన్న ఏబీ వెంకటేశ్వరరావు తన ప్రచారాన్ని ప్రత్యేక శైలిలో నిర్వహిస్తున్నారు. అవినీతి రహిత నగర పాలన, పన్నుల భారం తగ్గించడం, లంచాలు లేని సేవలు అనే నినాదాలతో మేధావులు, మధ్యతరగతి , విద్యాధికుల ఓటు బ్యాంక్‌ను ఆకర్షించేందుకు ఆయన తీవ్రంగా శ్రమిస్తున్నారు. వామపక్ష బలానికి తోడు కాంగ్రెస్ పార్టీ మద్దతు లభించడం, అలాగే సీనియర్ ఐపీఎస్‌గా ఆయనకున్న నిష్కళంకమైన ఇమేజ్ ఏబీవీకి ప్రధాన బలంగా మారాయి. ఏ రాజకీయ పార్టీ బంధాలు లేకుండా, కేవలం విజయవాడ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ఆయన విసురుతున్న సవాళ్లు ప్రధాన పార్టీల అభ్యర్థులకు మింగుడుపడటం లేదు.అయితే, ఎన్డీయే కూటమి అభ్యర్థిగా బరిలో ఉన్న వంగవీటి రాధాకృష్ణకు బలమైన ప్రజాదరణ, వంగవీటి కుటుంబానికి నగరంలో ఉన్న అభిమానుల బలగం పెద్ద ప్లస్ పాయింట్. కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు తనను గెలిపిస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఆసక్తికరమైన విషయమేమిటంటే.. రాధాకృష్ణ, ఏబీ వెంకటేశ్వరరావు ఇద్దరూ ఒకరిపై ఒకరు వ్యక్తిగత విమర్శలు చేసుకోకుండా అత్యంత హుందాతనంతో ప్రచారం సాగిస్తుండటం ఈ ఎన్నికల ప్రత్యేకతగా నిలిచింది. రాధా సైతం నగరాభివృద్ధికి ఏబీవీ సలహాలు తీసుకుంటా అని ప్రకటించగా, ఏబీవీ కూడా మాది భావజాల పోరాటమే తప్ప వ్యక్తిగతం కాదని స్పష్టం చేశారు.మరోవైపు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి రాయన భాగ్యలక్ష్మి బిసి సామాజిక వర్గ సమీకరణాలు, తమ హయాంలో చేసిన అభివృద్ధి పనులనే నమ్ముకుని ముందుకు వెళ్తున్నారు. అయితే, ఓట్ల

అమెరికా-ఇరాన్ చర్చలు.. మరో యుద్ధాన్ని ఆపగలవా?



వాషింగ్టన్: అమెరికా-ఇరాన్ మధ్య మరోసారి యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్న వేళ దౌత్య ప్రయత్నాలు ఊపందుకున్నాయి. వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధిని రెండు రోజుల్లో తిరిగి తెరవడం తాజా చర్చల్లో ప్రధాన అంశంగా మారింది. అయితే మరోవైపు ఇరాన్, అమెరికా రెండూ తమ తమ షరతులపై వెనక్కి తగ్గకపోవడంతో చర్చలు ఎంతవరకు ఫలిస్తాయన్నది ఆసక్తికరంగా మారింది.

హోర్ముజ్ తెరవడమే కేంద్ర బిందువు

అమెరికా-ఇరాన్ మధ్య చర్చలను ముందుకు తీసుకెళ్లేందుకు ఖతార్, పాకిస్థాన్ మధ్యవర్తిత్వం చేస్తున్నాయి. తాజాగా జరిగిన చర్చల్లో ఇరాన్ ప్రతిపాదించిన ఏడు రోజుల ప్రణాళికను కుదించి రూపొందించిన ఒక రూపురేఖపై ప్రధానంగా చర్చ జరిగినట్లు సమాచారం.ఇది తుది ఒప్పందం కాదని, మళ్లీ చర్చలు ప్రారంభించడానికి మార్గం సుగమం చేసే ప్రాథమిక ప్రణాళిక మాత్రమేనని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ తెలిపారు.ఇరాన్ షరతుల ప్రకారం.. అమెరికా ముందుగా కొన్ని చర్యలు తీసుకోవాలి. ఆ తర్వాతే హోర్ముజ్ జలసంధిని తిరిగి తెరవడానికి ఇరాన్ సిద్ధమవుతుంది.

ఇరాన్ ముందున్న ప్రధాన షరతులు

ఇరాన్ కోరుతున్న అంశాల్లో ప్రధానంగా మూడు ఉన్నాయి.

-అమెరికా విధించిన ఆర్థిక ఆంక్షలను సడలించాలి.

- హోర్ముజ్ ప్రాంతంలో అమెరికా కొనసాగిస్తున్న నౌకాదళ దిగ్బంధాన్ని ఎత్తివేయాలి.

-ప్రాంతీయంగా కొనసాగుతున్న దాడులను అమెరికా నిలిపివేయాలి.

ఈ చర్యలు తీసుకున్న తర్వాత హోర్ముజ్ జలసంధిని తిరిగి తెరవడానికి ఇరాన్ అంగీకరించే అవకాశం ఉంది.

గతంలోనూ చర్చలు.. చివరకు విఫలం

అమెరికా-ఇరాన్ మధ్య చర్చలు కొత్తవి కావు. గతంలోనూ మధ్యవర్తిత్వ ప్రయత్నాలు జరిగాయి. అయితే అవి చివరకు సఫలం కాలేదు. జూన్‌లో కుదిరిన అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కూడా కొత్త దాడులు, సముద్ర రవాణాకు సంబంధించిన వివాదాల నేపథ్యంలో ముందుకు సాగలేదు. అనంతరం సెప్టెంబర్‌లో ఇరాన్ ప్రతిపాదించిన ఏడు రోజుల ప్రణాళికను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తిరస్కరించారు. తర్వాత ఖతార్ ప్రతిపాదించిన మరో మార్గాన్ని కూడా ఇరాన్ అధికారి ఒకరు "ఆమోదయోగ్యం కాని ఆలోచనలు.. ఇది అసలు ప్రతిపాదనే కాదు" అంటూ కొట్టిపారేశారు.

అమెరికా వైఖరిలో మార్పు?

ఇటీవల అమెరికా వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్ నుంచి వచ్చిన లేఖలోని భాష గతంతో పోలిస్తే పూర్తిగా మారిపోయిందని ఇరాన్ భద్రతా అధికారి మొహ్సెన్ రెజాయీ పేర్కొన్నారు.అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కూడా దౌత్య చర్చలకు సానుకూలంగా ఉన్నట్లు సంకేతాలు ఇచ్చారు. దీంతో రెండు దేశాల మధ్య మరోసారి చర్చలకు అవకాశం ఏర్పడిందన్న ఆశలు వ్యక్తమవుతున్నాయి.అయితే ఈ ఆశలు ఎంతకాలం కొనసాగుతాయన్నదే ఇప్పుడు కీలక ప్రశ్నగా మారింది.

ట్రంప్ హెచ్చరికతో మళ్లీ టెన్షన్

ఒకవైపు చర్చలకు అవకాశం ఉందన్న సంకేతాలు వస్తుండగానే మరోవైపు ట్రంప్ హెచ్చరికలు ఉద్రిక్తతలను పెంచుతున్నాయి. నవంబర్ 3న జరిగే మధ్యంతర ఎన్నికల తర్వాత ఇరాన్‌పై మరోసారి దాడులు చేసే అవకాశం ఉందని ట్రంప్ హెచ్చరించారు.దీంతో చర్చలు ఒకవైపు కొనసాగుతున్నప్పటికీ.. మరోవైపు సైనిక చర్య ముప్పు కూడా అలాగే ఉందన్న సంకేతాలు వెలువడుతున్నాయి.

అసలు సమస్య ఇదే..

అమెరికా-ఇరాన్ మధ్య చర్చలకు ప్రధాన అడ్డంకి గతంలో ఉన్నదే. ముందుగా ఎవరు వెనక్కి తగ్గాలి? అన్న అంశంపైనే పేచీ కొనసాగుతోంది.ఇరాన్ తన షరతులను ముందుగా అమలు చేయాలని పట్టుబడుతోంది. ఆంక్షల సడలింపు, నౌకాదళ దిగ్బంధం తొలగింపు, ప్రాంతీయ దాడుల నిలిపివేత వంటి చర్యలు ముందుగా జరగాలని కోరుతోంది.అమెరికా మాత్రం చర్చల ప్రారంభం నుంచే ఇరాన్ అణు కార్యక్రమంపై చర్చలు జరగాలని పట్టుబడుతోంది.ఇలా రెండు దేశాలు తమ తమ అంశాలను ముందుగా పరిష్కరించాలంటూ పట్టుబడుతుండటంతో ప్రతిష్టంభన కొనసాగుతోంది.

మరో యుద్ధాన్ని చర్చలు ఆపగలవా?

హోర్ముజ్ జలసంధి పునఃప్రారంభానికి సంబంధించిన తాజా ప్రతిపాదన అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలను తగ్గించేందుకు ఒక అవకాశాన్ని కల్పించింది. అయితే గతంలో పలుమార్లు చర్చలు విఫలమైన నేపథ్యంలో ఈసారి కూడా పరిస్థితి ఎటు మలుపు తిరుగుతుందన్నది స్పష్టంగా లేదు.ఒకవైపు ఇరాన్ దౌత్య పరిష్కారానికి అవకాశం ఉందని చెబుతుండగా.. మరోవైపు అమెరికా నుంచి సైనిక చర్యపై హెచ్చరికలు వస్తున్నాయి. లిలిచర్చలు విజయవంతమై హోర్ముజ్ తెరుచుకుంటే ప్రపంచ చమురు సరఫరాకు ఊరట లభించే అవకాశం ఉంది. అదే చర్చలు విఫలమై మరోసారి యుద్ధం మొదలైతే అంతర్జాతీయ చమురు మార్కెట్లపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉంది.అందుకే ప్రస్తుతం ప్రపంచ దేశాల దృష్టి మొత్తం అమెరికా-ఇరాన్ చర్చలపైనే ఉంది.

జనగామ రైల్వేస్టేషన్‌కు నయా లుక్..రూ.25 కోట్లతో ఆధునిక హంగులు

వరంగల్, అమృత్ భారత్ రైల్వేస్టేషన్ పథకం కింద రూ. 25 కోట్లతో జనగామ రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులు పూర్తయ్యాయి. ఆకర్షణీయమైన ప్రవేశ ద్వారం, సాంస్కృతిక చిత్రాలు, విస్తరించిన ప్లాట్‌ఫాంలు, ఏసీ?నాన్ ఏసీ వెయిటింగ్ హాళ్లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జి, లిఫ్టులు, డిజిటల్ డిస్‌ప్లే బోర్డులు అందుబాటులోకి వచ్చాయి. అయితే స్టేషన్ ఆవరణలో కోతుల బెడద, ఫుట్ ఓవర్ బ్రిడ్జి వినియోగంలో ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.తెలంగాణలో రైల్వే ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా జనగామ రైల్వేస్టేషన్‌ను అత్యాధునికంగా అభివృద్ధి చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అమృత్ భారత్ రైల్వేస్టేషన్ పథకం కింద సుమారు రూ. 25 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. సికింద్రాబాద్?కాజీపేట రైలుమార్గంలో కీలకంగా ఉన్న ఈ స్టేషన్ ఇప్పుడు ఆధునిక హంగులు, ఆకర్షణీయమైన నిర్మాణాలు, మెరుగైన ప్రయాణికుల సౌకర్యాలతో కొత్త శోభను సంతరించుకుంది. గతంలో సాధారణ రూపంలో కనిపించిన స్టేషన్ ప్రాంగణం ప్రస్తుతం విశాలమైన ప్రవేశ మార్గాలు, సుందరీకరణ, ఆధునిక వసతులతో ప్రయాణికులను ఆకట్టుకుంటోంది. స్టేషన్ ప్రధాన ప్రవేశ ద్వారాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దడంతో పాటు భవన గోడలపై స్థానిక సంస్కృతి, ఆధ్యాత్మిక వారసత్వాన్ని ప్రతిబింబించేలా ప్రత్యేక చిత్రాలు రూపొందించారు. ఆలయ గోపురాలను తలపించే నిర్మాణ శైలి స్టేషన్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ప్రాంగణంలో విశాలమైన రహదారులు, టైల్స్‌తో నిర్మించిన నడక మార్గాలు, పచ్చిక బయళ్లను ఏర్పాటు చేశారు. ప్రయాణికులకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించడంతో పాటు స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా, క్రమబద్ధంగా ఉంచేలా సుందరీకరణ పనులు చేపట్టారు. దీంతో స్టేషన్ రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి.రైళ్ల రాకపోకలు, ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్లాట్‌ఫాంలను విస్తరించి ఆధునికీకరించారు. రైళ్ల కోసం వేచి ఉండే ప్రయాణికుల సౌకర్యార్థం ఏసీ, నాన్-ఏసీ వెయిటింగ్ హాళ్లను ఆధునిక ఫర్నీచర్‌తో సిద్ధం చేశారు. ప్రయాణికులు ఒక ప్లాట్‌ఫాం నుంచి మరో ప్లాట్‌ఫాంకు సులభంగా వెళ్లేందుకు గతంలో ఉన్న పాత వంతెన స్థానంలో విశాలమైన ఫుట్ ఓవర్ బ్రిడ్జిని నిర్మించారు. వృద్ధులు, దివ్యాంగులు, మహిళలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు లిఫ్టులను అందుబాటులోకి



తెచ్చారు. వీటి ద్వారా ప్లాట్‌ఫాంల మధ్య రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి.ప్రయాణికులకు సమాచారాన్ని వేగంగా అందించేందుకు డిజిటల్ డిస్‌ప్లే బోర్డులను ఏర్పాటు చేశారు. రైళ్ల రాకపోకల వివరాలు స్పష్టంగా వినిపించేలా అనౌన్స్‌మెంట్ వ్యవస్థను మెరుగుపరిచారు. టికెట్ల కొనుగోలు కోసం ఆధునిక బుకింగ్ కౌంటర్లను ఏర్పాటు చేసి ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించారు. స్టేషన్ లోపలి ప్రాంతాలతో పాటు బయట కూడా సుందరీకరణ పనులు చేపట్టడంతో మొత్తం ప్రాంగణం కొత్త రూపును సంతరించుకుంది. గతంలో కనీస వసతుల కోసం ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రయాణికులు ఇప్పుడు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి రావడంపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.అయితే స్టేషన్ ఆధునికీకరణతో పాటు కొన్ని సమస్యలను కూడా పరిష్కరించాల్సిన అవసరం ఉందని ప్రయాణికులు చెబుతున్నారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జిని ఉపయోగించి ప్లాట్‌ఫాంల మధ్య వెళ్లేటప్పుడు కొంత ఇబ్బంది ఎదురవుతోందని పేర్కొంటున్నారు. ముఖ్యంగా స్టేషన్ ఆవరణలో కోతుల సంచారం అధికంగా ఉండటంతో ప్రయాణికులు, వృద్ధులు, పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోతుల బెడదను నివారించేందుకు రైల్వే అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. మొత్తంగా రూ. 25 కోట్లతో ఆధునికీకరించిన జనగామ రైల్వేస్టేషన్ ప్రయాణికులకు మెరుగైన సదుపాయాలు అందించే దిశగా ముందడుగు వేయగా.. మిగిలిన సమస్యల పరిష్కారంతో ప్రయాణ అనుభవం మరింత మెరుగుపడనుంది.

సిటీ మధ్యలో రియల్ జోరు...



హైదరాబాద్, నవంబర్ 2,హైదరాబాద్ మహానగరం వేగంగా విస్తరిస్తోంది. అయితే ఒకప్పుడు రియల్ ఎస్టేట్‌కు కేంద్ర బిందువైన సెంట్రల్ హైదరాబాద్ ఇప్పుడు మళ్లీ జోరు కనబరుస్తోంది. పూర్వ వైభం దిశగా వడి వడిగా అడుగులు వేస్తోంది. పాత ఇళ్ల స్థానంలో కొత్త ఆకాశ హర్మ్యాలు వెలుస్తున్నాయి. ఆకాశాన్ని తాకేలా భవనాలతో అందరి చూపుని ఆకర్షిస్తోంది.దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో హైదరాబాద్ ముందు వరుసలో ఉంటుంది. నగరం నలుమూలల విస్తరిస్తూ మల్టీనేషనల్ కంపెనీలను ఆకర్షిస్తోంది. అయితే, ఒకప్పుడు వ్యాపార, వాణిజ్య, నివాస, ఉపాధి కేంద్రాలకు కేంద్ర బిందువుగా ఉన్న సెంట్రల్ హైదరాబాద్ ఇప్పుడు మళ్లీ ఫోకస్‌లోకి వచ్చింది. మళ్లీ పూర్వ వైభవం దిశాగా అడుగులు వేస్తోంది. బషీర్‌బాగ్, సైఫాబాద్ వంటి ప్రాంతాల్లో ఆకాశ హర్మ్యాలు వెలిశాయి. ఎత్తయిన రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్ భవనాలు నిర్మితమవుతున్నాయి. బేగంపేట విమానాశ్రయం తరలింపు, ట్రాఫిక్ సమస్యల వంటి వివిధ కారణాలతో ఈ ప్రాంతం శోభ తగ్గినా.. ప్రస్తుతం పాత భవనాల పునర్నిర్మాణం, పరిశ్రమల భూముల వినియోగంలో మార్పుల ద్వారా సరికొత్త రియల్ ఎస్టేట్ రంగును సంతరించుకుంటోంది. లగ్జరీ గేటెడ్ కమ్యూనిటీలు, ఆకాశహర్మ్యాల నిర్మాణాలు జోరందుకుంటున్నాయి.నగరంలోని కోర్ సిటీలో ఖాళీ స్థలాల లభ్యత దాదాపు శూన్యం కావడంతో డెవలపర్లు రీ-డెవలప్‌మెంట్ నమూనాపై దృష్టి సారించారు. ఒకప్పుడు ఔటర్ రింగ్ రోడ్ లోపల ఉన్న పరిశ్రమలను బయటకు తరలించే క్రమంలో, ప్రభుత్వం ఆ భూముల కేటగిరీని నివాస ప్రాజెక్టులకు మార్చడంతో భారీ ప్రాజెక్టులకు మార్గం సుగమమైంది. పాత ఐదంతస్తుల భవనాలు, ఫ్యాక్టరీలు, స్టూడియోలను కూల్చివేసి వాటి స్థానంలో 20 నుంచి 50 అంతస్తుల భారీ నివాస కాంప్లెక్స్‌లను నిర్మిస్తున్నారు. పంజాగుట్ట, బేగంపేట, అబిడ్స్, ఆర్టీసీ క్రాస్ రోడ్స్, సోమాజిగూడ, కవాడిగూడ, వీఎస్‌టీ, గోల్కొండ చౌరస్తాలలో భారీ హైరైజ్ ప్రాజెక్టులు అందుబాటులోకి వచ్చాయి.ఐటీ కారిడార్‌తో పోలిస్తే సెంట్రల్ హైదరాబాద్‌కు ఉన్న మౌలిక సదుపాయాలే దీని పునరుజ్జీవనానికి ప్రధాన కారణం. బస్సు, ఎంఎంటీఎస్ రైలు, మెట్రో కనెక్టివిటీ అందుబాటులో ఉండడం ప్లస్ పాయింట్. కేవలం 20 నుంచి 30 నిమిషాల్లో ప్రైవేట్, పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ద్వారా గచ్చిబౌలి, హైటెక్ సిటీలకు చేరుకునే సౌలభ్యం ఉంది. నగరంలోనే అత్యుత్తమ విద్యా సంస్థలు, కార్పొరేట్ హాస్పిటళ్లు, ప్రభుత్వ కార్యాలయాలు, షాపింగ్ మాల్స్, హుస్సేన్ సాగర్ వంటి పర్యాటక ప్రాంతాలు సమీపంలోనే ఉన్నాయి.తరతరాలుగా సెంట్రల్ హైదరాబాద్‌లోనే నివసిస్తున్న వ్యాపారవేత్తలు, ఉద్యోగుల కుటుంబాలు తమ నివాసాలను నూతన జీవనశైలికి తగ్గట్టుగా అప్ గ్రేడ్ చేసుకోవాలని కోరుకుంటున్నారు. ఇన్నాళ్లూ సెంట్రల్ హైదరాబాద్‌లో లగ్జరీ అపార్ట్‌మెంట్లు లేక ఐటీ కారిడార్ వైపు వెళ్లిన వారు, ఇప్పుడు కోర్ సిటీలోనే అందుబాటులోకి వస్తున్న ఆధునిక ప్రాజెక్టులను ఎంచుకుంటున్నారు. కొరత, ప్రీమియం లొకేషన్ కారణంగా సెంట్రల్ హైదరాబాద్‌లో వస్తున్న ప్రాజెక్టులలో ప్లాట్ల, ప్రారంభ ధర రూ.1 కోటికి పైనే పలుకుతోందని రియల్టర్లు పేర్కొంటున్నారు.

హోటల్‌లో విషవాయువు లీక్.. నలుగురు కార్మికులు మృతి

ఉజ్జయిని: మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఓ ప్రైవేట్ హోటల్‌లోని ఆహార వ్యర్థాల గదిని శుభ్రం చేస్తుండగా విషవాయువు ప్రభావంతో నలుగురు కార్మికులు మృతి చెందారు. మరో ఇద్దరు వారిని కాపాడేందుకు ప్రయత్నిస్తూ అస్వస్థతకు గురయ్యారు. శనివారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో దేవాస్ రోడ్డులోని శ్రీ గంగా హోటల్‌లో ఈ ఘటన జరిగింది.

ఒక్కొక్కరిగా గదిలోకి వెళ్లి..

హోటల్‌లో ఆహార పదార్థాల వ్యర్థాలను సేకరించే భూగర్భ గదిని శుభ్రం చేసేందుకు కార్మికులు వెళ్లారు. ఈ క్రమంలో ఇద్దరు కార్మికులు లోపలికి వెళ్లి స్పృహ కోల్పోయినట్లు ప్రాథమిక సమాచారం. వారిని కాపాడేందుకు మరో ఇద్దరు కూడా గదిలోకి వెళ్లడంతో నలుగురూ విషవాయువు ప్రభావానికి గురయ్యారు. ఊపిరాడక ప్రాణాలు కోల్పోయినట్లు పోలీసులు తెలిపారు. వారిని బయటకు తీసేందుకు ప్రయత్నించిన మరో ఇద్దరు కూడా విషవాయువు పీల్చి అస్వస్థతకు గురయ్యారు. దీంతో వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

కట్టింగ్ యంత్రాలతో గది తెరిచిన అధికారులు

సమాచారం అందుకున్న పోలీసులు, జిల్లా అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గది తలుపు తెరవడం సాధ్యం కాకపోవడంతో కట్టింగ్ యంత్రాన్ని ఉపయోగించి దాన్ని తెరిచారు. సుమారు గంటన్నర పాటు



శ్రమించి నలుగురు కార్మికులను బయటకు తీసుకొచ్చారు. పోలీసులు సీపీఆర్ చేసినప్పటికీ వారిని కాపాడలేకపోయారు. ఆసుపత్రికి తరలించగా వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

భద్రతా ప్రమాణాలపై విచారణ

ఈ ప్రమాదానికి గల కారణాలు, కార్మికులు గదిలోకి వెళ్లే ముందు తగిన భద్రతా ఏర్పాట్లు చేశారా అనే అంశాలపై పోలీసులు విచారణ చేపట్టారు. హోటల్ యాజమాన్యం నిర్లక్ష్యం ఏమైనా ఉందా అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నివేదిక, ఇతర ఆధారాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోనున్నారు. మరోవైపు, మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 4 లక్షల

జూబ్లీహిల్స్, తార్నాక..మితిమీరుతున్న సౌండ్ పొల్యూషన్

హైదరాబాద్, నవంబర్ 2, హైదరాబాద్ నగరంలో శబ్ద కాలుష్యం రోజురోజుకూ పెరుగుతోంది. నివాస ప్రాంతాలు, వాణిజ్య కేంద్రాలు, చివరకు నిశ్శబ్ద ప్రాంతాలుగా ప్రకటించిన జోన్లలోనూ అనుమతించిన పరిమితులకు మించి శబ్దాలు నమోదవుతున్నాయి. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి 2026 జనవరి నుంచి జులై వరకు సేకరించిన గణాంకాలు ఈ పరిస్థితిని వెల్లడిస్తున్నాయి. నగరంలోని పలు ప్రాంతాల్లో పగలు, రాత్రి వేళల్లోనూ శబ్ద స్థాయిలు నిర్దేశిత ప్రమాణాలను దాటుతున్నాయి. ముఖ్యంగా జూబ్లీహిల్స్, తార్నాకలోని నివాస ప్రాంతాల్లో పర్యవేక్షణ జరిగిన కాలమంతా అనుమతించిన స్థాయికి మించి శబ్ద కాలుష్యం నమోదైంది. వాణిజ్య ప్రాంతమైన జేఎన్‌టీయూలోనూ ఇదే పరిస్థితి కొనసాగగా.. అబిడ్స్‌లో పలు నెలలపాటు రాత్రి వేళల్లో వరిమితులు ఉల్లంఘించినట్లు గణాంకాలు సూచిస్తున్నాయి.నగరంలో శబ్ద కాలుష్యానికి వాహనాల రాకపోకలు, అనవసర హారన్ల మోత ప్రధాన కారణాలుగా నిపుణులు చెబుతున్నారు. అధిక శబ్దంతో మోగించే డీజేలు, నిర్మాణ పనులు, ఫంక్షన్ హాళ్లలో జరిగే కార్యక్రమాలు కూడా సమస్యను తీవ్రతరం చేస్తున్నాయి. ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే కూడళ్ల వద్ద పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. రోడ్డు భద్రత కార్యకర్త అరుణ్ బతులా తెలిపిన వివరాల ప్రకారం.. వినాయక చవితికి ముందు ఆయన ట్రాఫిక్ పోలీసులతో కలిసి సచివాలయం సమీపంలోని తెలంగాణ తల్లి కూడలిలో గంటపాటు శబ్ద స్థాయిలను పరిశీలించారు. ఆ సమయంలో 82 నుంచి 110 డెసిబెల్స్ వరకు శబ్దం నమోదైంది. నిరంతరం వినిపించే హారన్లను ఎలా భరిస్తున్నారని అక్కడి సిబ్బందిని అడిగితే, ఆ శబ్దాలకు అలవాటు పడిపోయామని కొందరు చెప్పినట్లు ఆయన వివరించారు. మరికొందరు నిద్రలోనూ హారన్ల శబ్దాలు వినిపిస్తున్నాయని చెప్పడం సమస్య తీవ్రతను తెలియజేస్తోంది.అనవసరంగా హారన్లు మోగించకుండా వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నామని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసుల జాయింట్ కమిషనర్ జోయెల్ డేవిస్ తెలిపారు. హెచ్‌సీఎస్‌సీ వాలంటీర్ల సహకారంతో ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అదనపు మల్టీ హారన్లు అమర్చిన వాహనాలపై క్రమం



తప్పకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నగరంలోని ప్రధాన ప్రాంతాల్లో వాహనాల రాకపోకలు, హారన్లే శబ్ద కాలుష్యానికి ప్రధాన కారణమని, శివారు ప్రాంతాల్లో నిర్మాణ పనుల వల్ల శబ్దం ఎక్కువగా ఉంటోందని వివరించారు.నిశ్శబ్ద ప్రాంతాలుగా ప్రకటించిన చోట్ల కూడా పరిస్థితి మెరుగ్గా లేదు. జూ పార్కులో పగటి వేళల్లో అనుమతించిన శబ్ద పరిమితి 50 డెసిబెల్స్ కాగా.. జనవరిలో 56.6 డెసిబెల్స్‌గా నమోదైన స్థాయి జులై నాటికి 61.5 డెసిబెల్స్‌కు చేరింది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పరిసరాల్లోనూ శబ్ద స్థాయిలు సుమారు 70 డెసిబెల్స్‌గా ఉండగా.. జులైలో 71.3 డెసిబెల్స్‌కు చేరాయి. రోడ్డు రవాణా వల్లే మొత్తం శబ్ద కాలుష్యంలో సుమారు 60 నుంచి 70 శాతం వాటా ఉంటుందని రోడ్డు భద్రత నిపుణుడు లోకేంద్ర సింగ్ తెలిపారు. గతంలో అనుమతించిన స్థాయికి మించి శబ్దం చేసే వాహనాలను గుర్తించేందుకు ట్రాఫిక్ పోలీసులు అకౌస్టిక్ కెమెరాల ప్రయోగం చేపట్టారని, వాటి ద్వారా శబ్ద తీవ్రతను కొలిచి నిబంధనలు ఉల్లంఘించిన వాహనాలకు ఈ-చలానాలు జారీ చేసే అవకాశం ఉండేదని వివరించారు. అయితే ఆ ప్రయత్నం ముందుకు సాగలేదన్నారు. శబ్ద కాలుష్యాన్ని నియంత్రించేందుకు అవగాహన కార్యక్రమాలతోపాటు ఆధునిక పర్యవేక్షణ వ్యవస్థలు, నిరంతర తనిఖీలు, ఉల్లంఘనలపై కఠిన చర్యలు అవసరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రతిపక్షమంతా ఒక్కటిగా...మోడీ షా టార్గెట్ గా !



న్యూఢిల్లీ,ఢిల్లీలోని రామ్ లీలా మైదాన్ ఒక కొత్త రాజకీయ సందర్భాన్ని సన్నివేశాన్ని దేశానికి చూపించింది. ప్రత్యేకించి బీజేపీ పాలకులకు కూడా కళ్ళకు కట్టించింది. ఇంతకీ ఆ సీన్ ఏంటి అంటే దేశంలోని ఆసేతు హిమాచలం దాకా వివిధ రాజకీయ పార్టీల నాయకులు అంతా కలసి ఒక్క చోటకు చేరడం. వారిని చేర్చింది ఎవరూ అంటే ఓటు చోరీ నినాదమో లేక జ్ఞానేశ్ కుమార్ రాజీనామా డిమాండ్ మాత్రమే కాదు, అంతకు మించి మోడీ వ్యతిరేక రాజకీయం. దేశంలో ఎన్డీయే ఆక్రమించిన రాజకీయ మైదానం సగం ఉందో లేదో కానీ ఆ మిగిలినది అంతా తాము ఆక్రమించుకుంటామని ఒక్కటిగా నిలిచి మోడీని ఢీ కొంటామని ఒక పదునైన సందేశమే రామ్ లీలా మైదానం ఇచ్చింది.

అన్నీ కలగలసి :

కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియా గాంధీ రాహుల్ గాంధీ మల్లికార్జున్ ఖర్గే ప్రియాంకా గాంధీ, ఎస్పీ నుంచి అఖిలేష్ యాదవ్, ఆర్జేడీ నుంచి తేజస్వి యాదవ్, కాశ్మీర్ నుంచి నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ, ఎన్‌సీపీ ఎంపీ సుప్రియా సూలే ఇలా ఒక్కరేమిటి ఇండియా కూటమిలో ఉన్న వారు అంతా హాజరయ్యారు. అంతా కలసి ఒకే వేదిక పంచుకున్నారు. ఒకే నినాదం వినిపించారు. ఢిల్లీ వీధులలో చేసిన ర్యాలీతో దేశానికి తాము అంతా ఉన్నామని భరోసా ఇచ్చే ప్రయత్నం చేశారు. అందరి మాటా ఒక్కటే. ఓట్ల చోరీ జరిగింది అని. అందరి డిమాండ్ ఒక్కటే జ్ఞానేశ్ కుమార్ దిగిపోవాలని. ఇక రాహుల్ గాంధీ అయితే ఒక అడుగు ముందుకేసి అందరి మాట తన మాటగా చెప్పేశారు, ఈ రోజు జ్ఞానేశ్, రేపటి రోజున మోడీయే మా టార్గెట్ అంటూ.

భారీ జన సందోహం :

ఇక ఢిల్లీలో రామ్ లీలా మైదానంలో జరిగిన ఇండియా కూటమి మార్చ్ కానీ సభ కానీ ఇంతటి జన సందోహంతో నిండిపోతుందని వారు కూడా ఊహించి ఉండరేమో. ఆ విధంగా భారీగా జనసందోహం తరలివచ్చింది. విపక్షాల నేతలు సైతం ఈ స్థాయి స్పందనను ముందే అంచనా వేసి ఉండరనడంలో సందేహం ఏ మాత్రం లేదు. అందుకే ఈ జనాన్ని చూసి ఉక్కిరిబిక్కిరి అయి మరింత ఆవేశపూరితంగా ఉత్తేజ పూరితంగా ఇండీ కూటమి నాయకులు అంతా ఘాటైన ప్రసంగాలు చేశారు. ఇక చూస్తే రామ్ లీలా మైదానం నలుమూలలా జనంతో కిక్కిరిసి పోవడమే కాకుండా, పరిసర వీధులు కూడా కూటమి మద్దతుదారులతో నిండిపోయాయి.

ఇండియా కూటమి హుషార్ :

ఇన్నాళ్ళూ ఇండియా కూటమిలో లుకలుకలు ఉన్నాయని ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా ఉంటారని ప్రచారాలు సాగేవి. అంతే కాదు పదవుల గురించి కూడా విభేదాలు ఉన్నాయని కూడా ప్రచారం సాగింది. ఇపుడు అందరిదీ ఒక్కటే లక్ష్యంగా మారింది. మోడీ ప్రభుత్వాన్ని ముందు గద్దె దించాలన్నదే ఆ లక్ష్యం. ఆ తరువాతనే మిగిలినవి అన్నీ అంటూ అంతా కూడబలుక్కుని మరీ వేదిక పంచుకున్నారనిపిస్తోంది అంటున్నారు. ఈ భారీ బహిరంగ సభ ద్వారా ఇండియా కూటమి తన ఉనికిని ప్రజా బలాన్ని బలంగా చాటుకోగలిగింది. అంతే కాదు దేశానికి అదే సమయంలో ఎన్డీయే పెద్దలకూ చూపించగలిగింది. మోడీని రాజకీయంగా సవాల్ చేస్తూ సాగిన ఈ సభ ఇండియా కూటమిని ఒక్కసారిగా పదగుడులు ముందుకు తీసుకుని వెళ్ళింది అని అంటున్నారు. మరి ఈ ఉత్సాహం ఇక్కడితో ఆగేది కాదని మరిన్ని సభలతో ఇక్యంగా ఇండీ కూటమి దూకుడు చేస్తే ఎన్డీయే కౌంటర్ ఏమిటి ఎలా ఉంటుంది అన్నదే చూడాల్సి ఉంది.

Edited, Printed, Published & owned by KOTAGIRI CHANDRA SHEKAR, Published From, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001, Printed at KOTAGIRI GRAPHICS & KOTAGIRI OFFSET PRINTER, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001. Editor: KOTAGIRI CHANDRA SHEKAR, RNINo. TELTEL/2022/86880, Cell:9440164140